తెలుగుకలం

TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

అనంతపురం | కర్నూలు | కడప | చిత్తూరు | ప్రకాశం | గుంటూరు | విజయవాడ | హైదరాబాద్

సంపుటి : 01 సంచిక : 87 ఎడిటర్. అచుకట్ల ఖాదర్ బాషా పేజిలు : 08 శుక్రవారం 30 - 10 - 2026వెల రూ. 2 రూ/

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

- అర్నబ్ తుపాను ప్రభావం నుంచి కోలుకోకముందే మరో ముప్పు
- దక్షిణ అండమాన్ సముద్రంలో కొత్త అల్పపీడనం
- రానున్న 48 గంటల్లో వాయుగుండంగా మారే అవకాశం
- నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రలో భారీ వర్షాలు
- కొత్త హెచ్చరికతో రైతులు, తీరప్రాంత ప్రజల్లో ఆందోళన

అమరావతి :

'అర్నబ్' తుపాను సృష్టించిన విధ్వంసం నుంచి ఆంధ్రప్రదేశ్ కోస్తా తీరం ఇంకా కోలుకోకముందే మరో ముప్పు పొంచి ఉంది. బంగాళాఖాతంలో కొత్తగా ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి రాష్ట్రం వైపు కదిలే అవకాశం ఉండటంతో తీర ప్రాంత ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా సమాచారం ప్రకారం, - మిగతా 2 లో





కొండా సురేఖ బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందే

- ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్
- గతంలో కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్న కొండా సురేఖ
- వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటే సరిపోదన్న ప్రవీణ్ కుమార్
- టామ్‌కామ్ సంస్థను మంత్రి వివేక్ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శ

హైదరాబాద్ :

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై గతంలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యల విషయంలో మాజీ మంత్రి కొండా సురేఖ షరతులు లేకుండా క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. సురేఖ తన వ్యాఖ్యలను కేవలం - మిగతా 2 లో

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన

- వెనక్కి తగ్గేది లేదన్న ఖర్గే
- రామ్‌లీలా మైదానంలో భారీ కార్యక్రమం
- నిరసన వాయిదా ఉండదన్న మల్లికార్జున ఖర్గే
- ఎస్ఐఆర్‌లో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షాల ఆరోపణ
- పండుగల సీజన్ దృష్ట్యా వాయిదా కోరిన వ్యాపార సంఘాలు
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యమన్న రాహుల్ గాంధీ



2 లో..



2 లో..

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు!

- ఎల్‌నినోపై కొత్త అంచనా!
- మార్చిలోనే ఎక్కువ మరణాలు సంభవించే అవకాశం ఉందని వెల్లడి
- ప్రపంచవ్యాప్తంగా 3.73 లక్షల మరణాల అంచనా
- నైజీరియాలో 56 వేల మరణాల ప్రమాదం ఉందన్న క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్
- ఎల్‌నినో ప్రభావం 2027 ప్రారంభం వరకు కొనసాగే అవకాశం

'అర్నబ్'తో ఆంధ్రప్రదేశ్‌కు రూ.4600 కోట్లకు పైగా నష్టం

- ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు
- నేడు కేంద్ర బృందం పరిశీలన
- అర్నబ్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో నష్టపోయిన పంటలను సీఎం ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు
- ఉన్నతాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు
- సీఎం చంద్రబాబు ఏరియల్ వ్యూ



అమరావతి :

అర్నబ్ తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయికి పర్యటనకు వెళ్లిన సీఎం, మార్గం మధ్యలో ఏరియల్ వ్యూ ద్వారా నష్టపోయిన పంటలను పరిశీలించారు. వరి చేలు, అరటి, కొబ్బరి తోటలు, ఆక్వా చెరువులను పరిశీలించారు. ఉన్నతాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఏరియల్ వ్యూ ద్వారా కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ ప్రాంతాలను చూసిన సీఎం ఆ ప్రాంతాల్లో తుపాన్ ప్రభావం ఎంత మేర ఉందన్నది స్వయంగా వీక్షించారు. నిమ్మకూరు, పామర్రు, బంటుమిల్లిలో నీట మునిగిన పొలాలను చూశారు. నరసాపురం, పాలకొల్లు, అమలాపురంలో నీట మునిగిన పొలాలను విహంగ వీక్షణం చేశారు. కాట్రేనికోనలో నీట మునిగిన పొలాలను, కూలిన కొబ్బరి చెట్లు పరిశీలించారు. ఏయే ప్రాంతాల్లో ఎంత నష్టం జరిగిందనే అంశాలను సీఎంకు అధికారులు వివరించారు. అనంతరం కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం చెయ్యేరులో క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత సీఎం మీడియాతో మాట్లాడారు. "గత తుపానులను దృష్టిలో పెట్టుకుని పనిచేశాం, అర్నబ్ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొన్నాం. అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని అప్రమత్తం చేశాం. అధికారుల అప్రమత్తతతో ప్రాణ నష్టం తగ్గింది. ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నాం. మారుమూల ప్రాంతాలకు వెళ్లాలన్నా ఎక్కడా అడ్డంకులు లేకుండా, రహదారులపై కూలిన చెట్లన్నీ తొలగించాం. టెలి కమ్యూనికేషన్‌లో కొన్ని ఇబ్బందులు తలెత్తాయి. సెల్ టవర్ల వద్ద టెలికాం సంస్థలు జనరేటర్లు ఏర్పాటు చేయకపోవడంతో సమస్యలొచ్చాయి. కోనసీమ, - మిగతా 2 లో

తుపాను బాధితులకు అండగా నిలవండి



- పార్టీ శ్రేణులకు జగన్ పిలుపు
- ప్రభుత్వ సహాయక చర్యలు పూర్తిగా విఫలమయ్యాయని జగన్ విమర్శ
- టీడీపీ నేతలు బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణ
- సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని వ్యాఖ్య

అమరావతి :

అర్నబ్ తుపాను బాధిత ప్రాంతాల్లో ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ అధినేత జగన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సహాయక చర్యలు విఫలమయ్యాయని విమర్శించారు. అధికార పార్టీ నేతలు 'బియ్యం మాఫియా'ను ప్రోత్సహిస్తూ కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి జిల్లా అధ్యక్షులు, రీజనల్ కో-ఆర్డినేటర్లతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... 'గ్రామ, వార్డు సచివాలయాల నిర్వీర్యం, వాలంటీర్ల వ్యవస్థ రద్దు ప్రభావం తుపాను సహాయక - మిగతా 2 లో



స్థానిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం

- ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం
- రెండు రోజుల పాటు కొనసాగనున్న ఓటింగ్ ప్రక్రియ
- ఎన్నికల సిబ్బంది, దూర ప్రాంతాల ఓటర్ల కోసం ప్రత్యేక సౌకర్యం

అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ఈరోజు ప్రారంభమైంది. ఈ ఓటింగ్ రెండు రోజుల పాటు కొనసాగనుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందితో పాటు, దూర ప్రాంతాల్లో నివసించే అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అధికారులు ఈ ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తున్నారు. - మిగతా 2 లో



'నేను అలా మాట్లాడాల్సింది కాదు'

- కేటీఆర్‌పై వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల కొండా సురేఖ వివరణ
- కేటీఆర్‌పై గతంలో చేసిన వ్యాఖ్యలపై కొండా సురేఖ తాజాగా వివరణ ఇచ్చారు
- ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు

హైదరాబాద్ :

కేటీఆర్‌పై గతంలో కొండా సురేఖ మంత్రి హోదాలో చేసిన వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల ఆమె వివరణ ఇచ్చారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. కేటీఆర్‌పై - మిగతా 2 లో

మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా



- వెంటనే బ్లాస్టింగ్ ఆపండి - బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు
- మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌లు చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు
- తక్షణమే బ్లాస్టింగ్ నిలిపివేయాలని డిమాండ్ చేశారు
- మల్లన్నసాగర్ రిజర్వాయర్‌ను పరిశీలించిన హరీశ్‌రావు

హైదరాబాద్ :

మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్టకు సమీపంలో అనుమతులు లేకుండా బ్లాస్టింగ్‌లు చేస్తుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎల్పీ - మిగతా 2 లో

నీటి వృథాపై ఫిర్యాదుకు 'పానీ' యాప్

- దుర్వినియోగం చేస్తే జరిమానాలు!
- "పానీ" పేరుతో ప్రత్యేక యాప్‌ను ఆవిష్కరించిన జలమండలి
- హైదరాబాద్‌లో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేలా జలమండలి చర్యలు చేపట్టింది
- నగరపౌరుల్ని భాగస్వామ్యం చేస్తూ సరికొత్త ఉద్యమానికి జలమండలి శ్రీకారం చుట్టింది
- "పానీ" యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది



హైదరాబాద్ :

హైదరాబాద్ మహానగరంలో నీటి దుర్వినియోగాన్ని అరికట్టేందుకు జలమండలి సరికొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టింది. నగర పౌరులను వాటర్ వారియర్స్‌గా ఆ ఉద్యమంలో భాగస్వాములను చేస్తూ 'హూూచీ×" పేరుతో ప్రత్యేక యాప్‌ను విడుదల చేసింది. హైదరాబాద్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జలమండలి కార్యాలయంలో ఎండీ అశోక్ రెడ్డితో కలిసి పానీ యాప్‌ను ఆవిష్కరించారు. నీటి వృథాను అరికట్టడంతో పాటు తాగునీటి ప్రాధాన్యతపై ప్రజలకు అవగాహన కల్పించేలా జలమండలి యాప్‌ను తీర్చిదిద్దింది. నీటిని వృథా చేసే వారిపై ఫిర్యాదు చేయడంతో పాటు వీడియోలు, ఫొటోలు యాప్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా నేరుగా సంబంధిత యజమానికి తన నల్లా బిల్లులో జరిమానాలను విధించనుంది. నీటి - మిగతా 2 లో

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 30 - 10 - 2026

సంపాదకీయం

చైనా దూకుడు...!

భారత్--చైనా సరిహద్దులో పరిస్థితి సవ్యంగా లేదంటూ ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసు అధినేత చేసిన ప్రకటన ఆందోళన కలిగిస్తోంది. గత కొన్ని రోజుల్లో అరుణాచల్‌లోని వివిధ సరిహద్దు పోస్టుల్లో ఘర్షణలు జరిగాయి, అవి ఇంకా కొనసాగుతున్నాయి అన్నారాయన. తన దళాలను ఉద్దేశించి చేసిన ప్రసంగమే కానీ, దానిని ఐటీబీపీ ప్రత్యక్ష ప్రసారం చేయడంతో ఆ విషయం మీడియాకూ ప్రజలకూ చేరింది. బ్రిక్స్ సదస్సుకోసం చైనా అధ్యక్షుడు భారతదేశంలో ఉన్న సమయంలో కూడా ఈ ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయని ఆయన మాటలను బట్టి అర్థంచేసుకోవాలి. ఘర్షణలను ధ్రువీకరిస్తూ ఐటీబీపీ అధినేత వ్యాఖ్యానించడం కూడా ఇదే తొలిసారి. చైనాతో ఉన్న దాదాపు మూడున్నరవేల కిలోమీటర్ల సరిహద్దును గస్తీకాస్తున్న దళాల అధిపతినుంచి వచ్చిన ఈ ప్రకటన పరిస్థితి తీవ్రతను తెలియచెబుతోంది.ఘర్షణలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని, ఆయా సందర్భాల్లో ఐటీబీపీకి చెందిన శౌర్య కమాండోలు అద్భుతంగా పనిచేస్తున్నారని, గల్వాన్ తరహా ఉదంతాలను ఎదుర్కోవడానికి మెరుగైన కార్యాచరణను సిద్ధం చేశామని ఐటీబీపీ డీజీ చెప్పుకొచ్చారు. అరుణాచల్‌లోని పలుప్రాంతాల్లో ఒక ప్రత్యేక కమాండో విభాగాన్ని, డ్రోన్‌ప్లాటూన్ల వంటివీ ఏర్పాటు చేయబోతున్నట్టుగా చెబుతూనే, చైనా ఆర్మీని ఢీకొనడానికి సంప్రదాయ యుద్ధపద్ధతులు సరిపోవనీ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అధికంగా వినియోగించాలని అన్నారాయన. సహజంగానే ఈ ప్రకటనపై విపక్ష కాంగ్రెస్ స్పందిస్తూ, ఈ పరిణామాలేవీ ప్రజలకు తెలియనివ్వకుండా, దేశానికి సమాధానం చెప్పకుండా కేంద్రం మౌనం పాటిస్తోందని, మరోపక్క చైనాకు భారీ రాయితీలు కొనసాగిస్తోందని విమర్శించింది. గల్వాన్ ఘటన తరువాత చైనానుంచి దిగుమతులు 102శాతం పెరిగాయని ఆ పార్టీ విమర్శ. భారత విదేశాంగశాఖ అధికారప్రతినిధి ఈ పరిణామాలమీద అతిజాగ్రత్తగా ప్రతిస్పందించారు. నిర్దేశించిన గస్తీ పరిమితులను చైనా బలగాలు ఉల్లంఘించినప్పుడల్లా సరిహద్దువెంబడి ఘర్షణలు జరుగుతున్నాయని ఆ దేశంమీద ఓ విమర్శ చేశారు. అపోహలకు తావులేకుండా ఇరుదేశాలు దౌత్యాన్ని ఉపయోగించుకుంటూనే ఉన్నాయని అంటూ సరిహద్దుల్లో శాంతి, సామరస్యాలు నెలకొనడం ఉభయదేశాల ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదలకు అత్యంత ముఖ్యమని గుర్తుచేశారు.ఆగస్టులో సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో అరుణాచల్‌లోని 27 ప్రదేశాలను వాటి ప్రామాణిక పేర్లతో భారతదేశం గుర్తించినప్పుడు ఇది కేవలం చైనాతో సాగుతున్న పేరుమార్పిడి యుద్ధంలో భాగమని అంతా అనుకున్నారు. అరుణాచల్‌లోని పలుప్రాంతాలకు చైనా తనసొంత పేర్లు పెడుతున్న నేపథ్యంలో, భారత అధికారిక పటంలో ఆ రాష్ట్రంలోని కీలకప్రాంతాలకు ఇలా నామకరణం చేసి, అరుణాచల్ మాదేనని విస్పష్టంగా చైనాకు చెప్పినందుకు జనం సంతోషించారు. మరీ ముఖ్యంగా ఇందులో అత్యంత సున్నితమైన, ఘర్షణలు రేగిన సరిహద్దు ప్రాంతాలు కూడా ఉన్నందున చైనా మ్యాప్‌వార్‌కు భారత్ గట్టి జవాబు ఇచ్చిందని భావించారు. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడుతున్న తరుణంలో ఇది పూర్తి విరుద్ధమైన చర్య అనీ, సరిహద్దు సమస్యలను సవ్యంగా పరిష్కరించుకోనివ్వకుండా ఇటువంటివి అడ్డుపడతాయంటూ చైనా ఈ చర్యను తప్పుబట్టింది కూడా. మరుసటి నెలలో చైనా అధ్యక్షుడు బ్రిక్స్ సదస్సుకోసం రాబోతున్న తరుణంలో భారత్ ఈ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యం కూడా కలిగించింది. అయితే, అరుణాచల్ సరిహద్దుల్లోని పలుప్రదేశాల్లో జూలై నుంచే వివాదాలు రేగాయని, కొన్ని ప్రదేశాల్లో చైనా సైనికులు ఆరేడుకిలోమీటర్ల లోపలకు చొరబడి గుడారాలు వేశారని ఇప్పుడు అర్థమవుతోంది.2017లో డోక్లాం, 2020లో గాల్వాన్ తరహాలో అరుణాచల్‌లో మరో తీవ్ర ఘర్షణ ముంచుకొస్తోందా? అని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. చైనా ఆర్మీ అనేక విషయాల్లో మనకంటే పైచేయిలో ఉందని, సాంప్రదాయవిధానాల్లో దాని దూకుడును నియత్రించడం కష్టమన్న రీతిలో ఐటీబీపీ చీఫ్ చేసిన కొన్ని వ్యాఖ్యలను తప్పుబట్టినవారు, హద్దులు దాటారని విమర్శించినవారు లేకపోలేదు. అయితే, పాలకులకు తెలియకుండా ఆయన ఈ సరిహద్దు ఘర్షణలను బహిర్గతం చేశారనీ అనుకోలేం. చైనానుంచి మనం మళ్ళీ ఎదుర్కొంటున్న ప్రమాదాన్ని రిటైర్ కావడానికి కొద్దిరోజులముందు ఈ అధికారి బహిర్గతం చేయడం ఏ కారణాలతో జరిగినప్పటికీ అది మనం సంసిద్ధతకు ఉపకరిస్తుంది.

మార్చి నాటికి భారత్‌లో ఎండలతో 55 వేల మరణాల ముప్పు!



మొదటిపేజీ తరువాయి - భారత్‌కు ఎల్‌నినో రూపంలో మరో వాతావరణ ముప్పు పొంచి ఉందా? రాబోయే నెలల్లో అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రాణనష్టాన్ని పెంచే ప్రమాదం ఉందని తాజా పరిశోధన ఆధారిత అంచనాలు హెచ్చరిస్తున్నాయి. అమెరికాలోని షికాగో విశ్వవిద్యాలయానికి చెందిన 'క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్' రూపొందించిన కొత్త ట్రాకర్ ప్రకారం.. 2026 అక్టోబర్ నుంచి 2027 మార్చి వరకు భారత్‌లో అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 55 వేల మరణాలు సంభవించే అవకాశం ఉంది. వీటిలో ఎక్కువ భాగం మార్చిలోనే నమోదయ్యే ప్రమాదం ఉందని అంచనా.ఇది వాతావరణ సమాచారం, ఉష్ణోగ్రతల అంచనాలు, గతంలో వేడికి సంబంధించిన మరణాల మధ్య ఉన్న సంబంధాల ఆధారంగా రూపొందించిన నమూనా అంచనా మాత్రమే. వాస్తవంగా ఎంతమంది మరణిస్తారో ఇది కచ్చితంగా చెప్పడం లేదు.ఎల్‌నినో అంటే పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరగడం. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా గాలుల దిశ, వర్షపాతం, ఉష్ణోగ్రతల్లో మార్పులు వస్తాయి. ఈసారి ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉండవచ్చని కొందరు నిపుణులు భావిస్తున్నారు. ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంఓ) కూడా ఈ ఏడాది ఎల్‌నినో బలంగా ఉందని, డిసెంబర్‌లో గరిష్ఠ స్థాయికి చేరే అవకాశం ఉందని హెచ్చరించింది. దీని ప్రభావాలు 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చని అంచనా. కొత్త ట్రాకర్ అంచనాల ప్రకారం.. అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ప్రపంచవ్యాప్తంగా అధిక వేడి కారణంగా సాధారణ స్థాయికి మించి సుమారు 3.73 లక్షల మరణాలు సంభవించే అవకాశం ఉంది. ఈ ఆరు నెలల కాలంలో నైజీరియాలో 56 వేల మరణాలు, భారత్‌లో 55 వేల మరణాలు సంభవించవచ్చని అంచనా. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మరణాలు సంభవించే ప్రమాదం ఉందని ట్రాకర్ పేర్కొంది.అయితే ఈ అంచనాలు మరణాలు తప్పనిసరిగా జరుగుతాయని చెప్పడం లేదు. ముందస్తు హెచ్చరికలు, తాగునీటి సదుపాయాలు, చల్లదనం కల్పించే కేంద్రాలు, బయట పనిచేసే కార్మికులకు రక్షణ, ఆరోగ్య సేవలను మెరుగుపరచడం ద్వారా ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

నవంబర్ 1న ఢిల్లీలో ఇండియా కూటమి భారీ నిరసన



మొదటిపేజీ తరువాయి - ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు.ఎన్నికల సంఘం చేపడుతున్న 'ప్రత్యేక సమగ్ర సవరణ' (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు. ఓటర్ల హక్కులకు భంగం కలుగుతోందని ఆరోపిస్తూ, ఈ అంశంపై తమ పోరాటం కొనసాగుతుందని చెప్పారు. అన్ని ప్రతిపక్ష పార్టీలు తమకు మద్దతుగా ఉన్నాయని వెల్లడించారు.పండుగల సీజన్‌లో భారీ ర్యాలీ నిర్వహిస్తే ఢిల్లీలో వ్యాపార కార్యకలాపాలు దెబ్బతింటాయని పలు వ్యాపార సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ర్యాలీని మరో తేదీకి మార్చాలని రాహుల్ గాంధీని కోరాయి. పెద్ద ఎత్తున జనసమీకరణ వల్ల వ్యాపార వాతావరణం దెబ్బతినడంతో పాటు తమ జీవనోపాధిపై ప్రభావం పడుతుందని వ్యాపారులు పేర్కొన్నారు. అయితే ఈ విజ్ఞప్తుల నేపథ్యంలోనూ నవంబర్ 1న నిరసన కొనసాగుతుందని ఖర్గే స్పష్టం చేశారు.మరోవైపు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కూడా నిరసనలో పాల్గొనాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ మార్చ్ ఏ ఒక్క పార్టీకి సంబంధించినది కాదని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటం, ఓట్ల చోరీని అడ్డుకోవడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం కోసమని అన్నారు. రాజకీయ భేదాలకు అతీతంగా విద్యార్థి సంఘాలు కూడా ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలు, వ్యక్తిగత అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కులు ముప్పును ఎదుర్కొంటున్నాయని ఆయన ఆరోపించారు.నవంబర్ 1న దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు ఢిల్లీకి తరలివచ్చే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. అంతకుముందు రోజు, అంటే అక్టోబర్ 30న, 'మాక్ పార్లమెంట్' నిర్వహించనున్నట్లు ఖర్గే వెల్లడించారు.

'అర్నబ్'తో ఆంధ్రప్రదేశ్‌కు రూ.4600 కోట్లకు పైగా నష్టం

మొదటిపేజీ తరువాయి - పశ్చిమగోదావరి జిల్లాల్లోనే ఎక్కువగా విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి" అని చంద్రబాబు తెలిపారు.రూ.4,600 కోట్లకు పైగా నష్టం : "ఇవాళ సాయంత్రానికి దాదాపు అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తాం. వెయ్యి మంది విద్యుత్ సిబ్బందిని పంపించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరాం. తెలంగాణ ప్రభుత్వం కూడా సాయం చేసేందుకు ముందుకొచ్చింది. అవసరమైతే తమిళనాడు, కర్ణాటక ప్రభుత్వాల సాయం కోరతాం. ఎల్లుండిలోగా ప్రతి ఇంటికీ విద్యుత్ సరఫరా చేసే బాధ్యత తీసుకుంటాం. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్లకు పైగా నష్టం జరిగింది. నష్ట పరిశీలనకు రేపు కేంద్ర బృందం వస్తుంది. అన్నివిధాలా అండగా ఉంటామని అమిత్‌షా భరోసా ఇచ్చారు" అని సీఎం తెలిపారు.అంతకుముందు వేట్లపాలెంలో అర్నబ్ తుపాను బాధిత రైతులతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. దెబ్బతిన్న కొబ్బరి చెట్టుకు రూ.1500 చొప్పున సాయం అందిస్తామని తెలిపారు. పునరావాస శిబిరాల్లో ఉన్న బాధిత కుటుంబాలకు 25 కిలోల చొప్పున బియ్యం ఇచ్చి ఇళ్లకు పంపిస్తామని చెప్పారు. మంత్రి అచ్చెన్నాయుడుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సీఎం పర్యటనలో పాల్గొన్నారు."ఎక్కడా ఒక్క చెరువు కూడా దెబ్బతినకుండా చేశాం. ప్రాథమిక అంచనా ప్రకారం రూ.4,600 కోట్లకు పైగా నష్టం జరిగింది. నష్ట పరిశీలనకు రేపు కేంద్ర బృందం వస్తుంది. అన్ని విధాలా అండగా ఉంటామని అమిత్‌షా భరోసా ఇచ్చారు. పంటలకు బీమా చేయించి, రైతులకు నష్టం లేకుండా చేశాం. ప్రాణనష్టం చాలా వరకు తగ్గింది. తుపాను తీరం దాటుతున్న సమయంలో 35 వేల మంది గ్రామస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఉన్నా. తుపాను సమయంలో ప్రతిక్షణం అధికారులకు గైడ్ చేస్తూనే ఉన్నా. బాధితులకు నిత్యావసరాలు ఇస్తున్నాం.

తుపాను బాధితులకు అండగా నిలవండి

మొదటిపేజీ తరువాయి - చర్యలపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రభుత్వం విపత్తులను ఆదాయ వనరుగా మార్చుకోవాల నుకుంటోంది' అని విమర్శించారు. సోనా మసూరి బియ్యం ధర కేజీ రూ.90 దాటిందని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రభుత్వంలోని కీలక నేతలే బియ్యం ధరల పెరుగుదలకు కారణమని ఆరోపించారు. 'మంత్రి పయ్యావుల వియ్యంకుడు సహా టీడీపీ నేతలు బియ్యాన్ని మార్కెట్‌కి రానీయకుండా బ్లాక్ చేసి, ఎక్స్‌పోర్టు చేస్తున్నారు. విపత్కర పరిస్థితుల్లోనూ బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నారు' అని జగన్ వ్యాఖ్యానించారు.తుపాను కారణంగా వరి, ఆక్వా, పండ్ల తోటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని, ఈ క్లిష్ట సమయంలో బాధితులకు తోడుగా నిలవాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ధాన్యం సేకరణలో రైతులకు అండగా ఉంటూ, ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని జగన్ స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో కొత్త అల్పపీడనం

మొదటిపేజీ తరువాయి - దక్షిణ అండమాన్ సముద్రం పరిసర ప్రాంతాల్లో ఒక అల్పపీడనం ఏర్పడింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా పయనిస్తూ తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. ఆ తర్వాత మరో 24 గంటల్లో ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండంగా కేంద్రీకృతమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.ఈ వాతావరణ వ్యవస్థ మరింత బలపడి ఆంధ్రప్రదేశ్ తీరం వైపు పయనించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో నవంబర్ 2, 3 తేదీల్లో ఉత్తర, దక్షిణ కోస్తాంధ్ర జిల్లాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.ఇప్పటికే 'అర్నబ్' తుపాను కారణంగా పంట నష్టం, ఆస్తి నష్టంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్న కోస్తా జిల్లాల ప్రజలను ఈ కొత్త హెచ్చరిక మరింత ఆందోళనకు గురిచేస్తోంది. రానున్న రోజుల్లో దీని తీవ్రత, కదలికలపై మరింత స్పష్టత వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

స్థానిక ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రారంభం



మొదటిపేజీ తరువాయి - ఈ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా జరిపేందుకు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను సిద్ధం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ప్రతి వార్డుకు ఒక రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), ఇద్దరు సహాయకులను నియమించారు.నిబంధనల ప్రకారం ఓటింగ్ నిర్వహించేందుకు అవసరమైన సిబ్బందిని క్షేత్రస్థాయిలో మోహరించారు. రెండు రోజుల పాటు జరిగే ఈ పోస్టల్ ఓటింగ్ పూర్తయిన వెంటనే, బ్యాలెట్ బాక్సులను పటిష్ఠ భద్రత నడుమ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలిస్తారు. ఈ మొత్తం ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు ఎన్నికల అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

కొండా సురేఖ బేషరతుగా క్షమాపణలు చెప్పాల్సిందే

మొదటిపేజీ తరువాయి - వెనక్కి తీసుకుంటే సరిపోదని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ భవన్ లో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.కేటీఆర్‌పై తన వ్యాఖ్యలు ఉద్దేశపూర్వకమైనవి కావని, వాటిని వెనక్కి తీసుకుంటున్నానని కొండా సురేఖ తాజాగా చేసిన ప్రకటనపై ప్రవీణ్ కుమార్ స్పందించారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉండి అలాంటి వ్యాఖ్యలు చేయడం నేరమని, ఆమె మాటలు తెలంగాణ మహిళల, రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీశాయని ఆరోపించారు. కేటీఆర్ పెద్ద మనసుతో కోర్టుకు వెళ్లారని, వాస్తవానికి ఆమెపై క్రిమినల్ కేసు పెట్టాల్సిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో హరీశ్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లకు కూడా ఇదే గతి పడుతుందని హెచ్చరించారు.ఇదే సందర్భంగా మంత్రి వివేక్ వెంకటస్వామిపై ప్రవీణ్ కుమార్ తీవ్ర ఆరోపణలు చేశారు. నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉపాధి కల్పించేందుకు ఏర్పాటు చేసిన టామ్‌కామ్ (తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ) సంస్థను మంత్రి వివేక్ దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు. జర్మనీలో ఉద్యోగాల పేరుతో ప్రకటనలు ఇచ్చి, ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 4.10 లక్షలు వసూలు చేశారని ఆరోపించారు.ఉచితంగా ఇవ్వాల్సిన అవకాశాలకు డబ్బులు వసూలు చేయడమే కాకుండా, టామ్‌కామ్ పేరుతో కాకుండా 'ఫెయిర్ ట్రీట్' అనే ప్రైవేట్ సంస్థ పేరుతో ఒప్పందాలు చేసుకున్నారని తెలిపారు. 200 మంది నుంచి డబ్బులు వసూలు చేసి, 10 మందిని కూడా జర్మనీకి పంపలేదని అన్నారు. మెకాట్రానిక్స్ ఉద్యోగం అని చెప్పి పంపిన ఓ యువకుడికి అక్కడ కత్తి ఇచ్చి బీఫ్, మటన్ కోయమన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి వివేక్ తన కుమారుడు గడ్డం వంశీకృష్ణను ఇలాగే పంపిస్తారా? అని ప్రశ్నించారు.

నీటి వృథాపై ఫిర్యాదుకు 'పానీ' యాప్

మొదటిపేజీ తరువాయి - దుర్వినియోగానికి అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశంతోనే యాప్‌ను తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. సమాజం బాగుండాలనుకునే ప్రతివ్యక్తి నీటి వృథాను అరికట్టాలన్నారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు పడినప్పుడు వరదా జలసంరక్షణ చేయట్లేదన్నారు. నీటిని దుర్వినియోగం చేసిన వారికి జరిమానాలు విధిస్తామని ఆయన తెలిపారు. భూగర్భజలాలు పెంచుకునే అవసరం, బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. ప్రతి ఇళ్లు, అపార్ట్‌మెంట్‌లో ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసుకోవాలని పొన్నం ప్రభాకర్ కోరారు.ప్రతి పౌరుడు 'సేవ్ వాటర్ వాలంటీర్'గా నమోదు చేసుకునేందుకు జలమండలి అవకాశం కల్పించినట్లు పొన్నం ప్రభాకర్ అన్నారు. బాగా పనిచేసిన వాలంటీర్‌కు సీఎంతో బ్రేక్‌ఫాస్ట్ లేదా లంచ్ మీట్ చేసేందుకు అవకాశం కల్పిస్తామన్నారు. హైదరాబాద్ నగరానికి రోజుకు 100 ఎంజీడీ నీళ్ల లోటు ఉందని, వివిధ జలాశయాల నుంచి 60 ఎంజీడీల నీళ్లను సర్దుబాటు చేస్తున్నామన్నామని జలమండలి తెలిపింది. సరఫరాలో కేవలం 40 ఎంజీడీల నీళ్ల లోటు మాత్రమే ఉందని తెలిపారు. నీళ్లను వృథా చేయొద్దని హైదరాబాద్ ప్రజలను కోరుతున్నామన్నారు. 'వాటర్ చీఓ' యాప్ ద్వారా పౌరులు స్వచ్ఛందంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. నీటిని వృథా చేసిన వారికి జరిమానా విధిస్తామని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. నీరు పొదుపుగా వాడుకోవటంపై ప్రజల్లో అందరూ అవగాహన కల్పించాలని సూచించారు.

మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా



మొదటిపేజీ తరువాయి - డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు ఆరోపించారు. పేలుళ్లతో కట్టకు ప్రకంపనలు వస్తున్నాయని, సమీపంలోని ఇళ్లకు పగుళ్లు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. తక్షణమే బ్లాస్టింగ్‌లను నిలిపివేసి, కట్ట భద్రతపై అధికారులు సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం తిప్పారం గ్రామం వద్ద మల్లన్నసాగర్ కట్టను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ పంటేరు యాదవరెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్లు పంటేరు ప్రతాపరెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు.పైప్‌లైన్ల పనుల కోసం జిలిటెన్ స్టిక్స్‌తో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారని, ఇందుకు ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అనుమతులు తీసుకోవాలని హరీశ్‌రావు అన్నారు. నిబంధనల ప్రకారం కట్టకు 400 మీటర్ల దూరంలో పేలుళ్లు జరపాల్సి ఉండగా, 200 మీటర్ల దూరంలోనే జరుగుతున్నాయని మండిపడ్డారు. రాత్రివేళల్లో బ్లాస్టింగ్‌లతో స్థానికులకు నిద్ర ఉండటం లేదని, ఇళ్లకు పగుళ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ఈ ప్రాజెక్టు భద్రత విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. ఇళ్లకు జరిగిన నష్టాన్ని అంచనా వేసి బాధితులకు పరిహారం అందించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు."మల్లన్నసాగర్ రిజర్వాయర్ కట్ట సమీపంలో బ్లాస్టింగ్‌లు చేస్తున్నారు. మల్లన్నసాగర్ కూల్చాలని కుట్ర చేస్తున్నారా. మల్లన్నసాగర్ కట్ట పక్కనే అనధికారిక బ్లాస్టింగ్ చేస్తున్నారు. మేడిగడ్డను చేసినట్లు మల్లన్నసాగర్‌ను చేయాలని చేస్తున్నారాతక్షణమే బ్లాస్టింగ్ నిలిపివేయాలి. కట్ట భద్రతపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్ష చేయాలి".మల్లన్నసాగర్ భూసేకరణలో అసైన్డ్ భూముల రైతులకు తక్కువగా, పట్టా భూముల రైతులకు ఎక్కువగా పరిహారం ఇచ్చి అన్యాయం చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే సమీక్షించి న్యాయం చేయకపోతే రైతులతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.తిప్పారం గ్రామం వద్ద పైప్‌లైన్ల పనుల కోసం జరుగుతున్న బ్లాస్టింగ్‌లతో ఇళ్లు దెబ్బతిన్నాయని, మల్లన్నసాగర్ కట్టకూ ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఫిర్యాదు చేశారు. సర్పంచ్‌తో కలిసి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా చర్యలు తీసుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు దెబ్బతిన్నవారు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు.

'నేను అలా మాట్లాడాల్సింది కాదు'



మొదటిపేజీ తరువాయి - ఉద్దేశపూర్వకంగా వ్యాఖ్యలు చేయలేదని, రాజకీయ పరిస్థితుల దృష్ట్యా ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. నాడు కొన్ని నిరాధార వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందన్న సురేఖ, కేటీఆర్ ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం తనకు లేదన్నారు. తన వ్యాఖ్యలు కేటీఆర్, ఆయన కుటుంబసభ్యులను నొప్పించి ఉంటే చింతిస్తున్నానని తెలిపారు. కేటీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నట్లు చెప్పారు."బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై గతంలో నేను చేసిన కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల వివరణ ఇవ్వాలని అనుకుంటున్నాను. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ విధంగా మాట్లాడానే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఆనాడు నేను చేసిన కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సింది. కేటీఆర్ లేదా ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ, వారి ప్రతిష్ఠకు భంగం కలిగించాలనే దురుద్దేశం గానీ నాకు ఎంతమాత్రం లేవు. నా వ్యాఖ్యలు వారిని గానీ, వారి కుటుంబ సభ్యులను గానీ నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ, ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నాను.మంత్రి కొండా సురేఖ 2024 అక్టోబర్‌లో కేటీఆర్‌పై పలు వ్యక్తిగత వ్యాఖ్యలు చేశారు. మంత్రిగా ఉన్న సమయంలో కేటీఆర్ అనేక మంది సినిమా హీరోయిన్ల జీవితాలతో ఆడుకున్నారని, సమంత-నాగ చైతన్య విడిపోడానికి కారణం కేటీఆరేనని సంచలన ఆరోపణలు చేశారు. కేటీఆర్ గతంలో ఫోన్ ట్యాపింగ్ ద్వారా అందరినీ ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిపారు. కేటీఆర్ వల్లే కొంతమంది హీరోయిన్స్ తొందరగా పెళ్లిళ్లు చేసుకుని సినిమాలు విడిచి వెళ్లిపోయారని ఆరోపించారు. కేటీఆర్ మత్తు పదార్థాలకు అలవాటు పడి, వారిని కూడా అందులోకి దించి రేవ్ పార్టీలు పెట్టారని విమర్శించారు. బ్లాక్ మెయిల్ చేసి అన్యాయంగా వాళ్ల జీవితాలతో ఆడుకున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా వివరణ ఇస్తూ ట్వీట్ చేశారు.ఈ విషయంలో అప్పుడే స్పందించిన కేటీఆర్ కొండా సురేఖకు తన న్యాయవాదుల ద్వారా లీగల్ నోటీసులు పంపించారు. తన గౌరవానికి, ప్రతిష్ఠకు భంగం కలిగించారని, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం తన పేరును ఇష్టారీతిన వాడుకుంటున్నారని ఆ నోటీసుల్లో పేర్కొన్నారు. ఒక మహిళా మంత్రిగా ఉండి సాటి మహిళల పేర్లను వాడుకొని వారి వ్యక్తిత్వ హననానికి పాల్పడడం అత్యంత బ

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 30 - 10 - 2026

అమ్మవడి అనాథ ఆశ్రమానికి చాపాడు తహసీల్దార్ విరాళం

దాతలు, ఉద్యోగుల ప్రశంసలు



మైదుకూరు(తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : కడప జిల్లా మైదుకూరులోని 'అమ్మవడి' అనాథ ఆశ్రమానికి దాతలు, రెవెన్యూ ఉద్యోగులు తమ వంతు సహకారాన్ని అందిస్తూ అనాథ పిల్లల సంక్షేమానికి అండగా నిలుస్తున్నారు. రెవెన్యూ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ఆశ్రమానికి పలువురు ఉద్యోగులు, దాతలు నిరంతరం తమ మద్దతు తెలుపుతున్నారు. ఈ క్రమంలో చాపాడు తహసీల్దార్ రమాదేవి అమ్మవడి ఆశ్రమాన్ని సందర్శించారు. అక్కడి పిల్లల అవసరాల నిమిత్తం ఆమె ఐదు ప్యాకెట్ల బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన రమాదేవి, భవిష్యత్తులో కూడా అమ్మవడి ఆశ్రమానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. అనాథ పిల్లల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపి ముందుకు వచ్చి సహాయం అందించిన తహసీల్దార్ రమా కుమారికి రెవెన్యూ ఉద్యోగులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. సమాజంలో నిరుపేద, అనాథ పిల్లలకు చేయూతనందించేలా ఇలాంటి సేవా కార్యక్రమాలకు దాతలు, ఉద్యోగులు మరింతగా ముందుకు వచ్చి తమ సహకారాన్ని అందించాలని వారు కోరారు.

చీమకుర్తిలో ఓటర్లకు డబ్బుల పంపిణీ

సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో తనిఖీలు, నలుగురు అరెస్ట్



చీమకుర్తి (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : గుంటూరు జిల్లా ?చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఓటర్లకు నగదు పంపిణీ చేస్తున్న నలుగురు వ్యక్తులను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచార నేపథ్యంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బు పంచుతున్నారన్న విశ్వసనీయ సమాచారం అందడంతో సీఐ ప్రసాద్ నేతృత్వంలోని పోలీస్ బృందం పట్టణంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టింది. ?ఈ తనిఖీల్లో భాగంగా చీమకుర్తి మున్సిపాలిటీలోని 1, 12, 21 మరియు 27వ వార్డుల్లో సోదాలు నిర్వహించి, అనుమానాస్పదంగా తిరుగుతున్న నలుగురు వ్యక్తులను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.83,600 నగదుతో పాటు ఓటర్ల జాబితాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, పట్టుబడిన వ్యక్తులు ఏ రాజకీయ పార్టీకి చెందినవారనే దానిపై దర్యాప్తు వేగవంతం చేశారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి ప్రలోభాలకు గురిచేస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల బ్యాలెట్ ముద్రణ పనులను పరిశీలించిన జెడ్పీ సీఈఓ





అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : రాబోయే 2026 ఎంపీటీసీ, జెడ్పీటీసీ రెండవ సాధారణ ఎన్నికల సన్నాహక చర్యల్లో భాగంగా అనంతపురం జిల్లా యంత్రాంగం ఏర్పాట్లను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా నగరంలోని ఒక ప్రింటింగ్ ప్రెస్ లో జరుగుతున్న బ్యాలెట్ పేపర్లు, పోస్టల్ బ్యాలెట్ పేపర్ల ముద్రణ పురోగతిని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ), అదనపు జిల్లా ఎన్నికల అధికారి శ్రీమతి పి. విజయలక్ష్మి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ తనిఖీల్లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, వెంకట నారాయణ కూడా పాల్గొన్నారు. సందర్శన సందర్భంగా నియోజకవర్గాల వారీగా పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాల ముద్రణను, ప్రింటింగ్ నాణ్యతను సీఈఓ సమగ్రంగా సమీక్షించారు. అనంతరం ఎన్నికల అధికారులతో మాట్లాడుతూ బ్యాలెట్ పత్రాలపై అభ్యర్థుల పేర్లు, క్రమసంఖ్యలు, కేటాయించిన గుర్తులు, బ్యాలెట్ కాగితాల రంగుల ఎంపికలో ఎటువంటి సాంకేతిక లేదా పరిపాలనాపరమైన పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు వహించాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా ముద్రణ ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రింటింగ్ ప్రక్రియ నిరంతరం పారదర్శకంగా జరిగేలా చూడటానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ సమతతో పాటు జిల్లాలోని అన్ని డివిజన్ల డివిజనల్ డెవలప్మెంట్ ఆఫీసర్లు (డీడీఓలు) ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను పర్యవేక్షించారు.

కదిరిలో దారుణం అడిగిన చోట బస్సు ఆపలేదని డ్రైవర్‌పై విచక్షణారహిత దాడి ముగ్గురు యువకులపై కేసు నమోదు!





కదిరి (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా కదిరి ప్రాంతంలో కొందరు ఆకతాయి యువకులు దౌర్జన్యానికి దిగి తీవ్ర కలకలం సృష్టించారు. బెంగళూరు నుండి కదిరికి వస్తున్న బస్సును అడ్డుకుని, విధులు నిర్వహిస్తున్న డ్రైవర్‌పై పిడిగుద్దులతో విచక్షణారహితంగా దాడి చేసిన ఘటన స్థానికంగా తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది.

అసలేం జరిగింది?

వివరాల్లోకి వెళ్తే... బెంగళూరు నగరం నుండి కదిరి వైపు వస్తున్న బస్సును అన్నమయ్య జిల్లా మద్దయ్య గారిపల్లి సమీపంలో ఆపాలని ముగ్గురు యువకులు యత్నించారు. అయితే, అది నిర్దిష్ట స్టాప్ కాకపోవడంతో డ్రైవర్ బస్సును ఆపకుండా ముందుకు తీసుకెళ్లాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన ఆ యువకులు ద్విచక్ర వాహనాలపై బస్సును వేగంగా సమీపించి, కొక్కంటి క్రాస్ వద్ద రహదారికి అడ్డంగా వాహనాలు నిలిపి బస్సును బలవంతంగా నిలిపివేశారు.

దాడికి తెగబడ్డ ఆకతాయిలు:

బస్సు ఆగగానే సదరు యువకులు తీవ్ర ఆవేశంతో డ్రైవర్‌ను కిందకు లాగి, పిడిగుద్దులు కురిపిస్తూ విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ హఠాత్ పరిణామంతో ప్రయాణికులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. అక్కడ ఉన్న స్థానికులు ఎంత వారించినా, అడ్డుకోబోయినా వినకుండా ఆ ముగ్గురు యువకులు రౌడీయజం చెలాయిస్తూ దాడిని కొనసాగించారు.

కేసు నమోదు, విచారణ వేగవంతం:

బాధితుడైన డ్రైవర్ అందించిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు తక్షణమే స్పందించారు. విధుల్లో ఉన్న డ్రైవర్‌పై దాడి చేసి, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినందుకు గానూ విశ్వనాథ్, రాము, మధుకుమార్ అనే ముగ్గురు యువకులపై చట్టపరమైన కేసు నమోదు చేశారు. ప్రజావాహనాల డ్రైవర్లపై ఇలాంటి దాడులకు పాల్పడితే సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతోంది.

మున్సిపాలిటీ ఎన్నికలకు పక్కా ఏర్పాట్లు చేయాలి

జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 29 : రాబోయే మున్సిపాలిటీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎటువంటి లోటుపాట్లు లేకుండా సజావుగా సాగేలా అన్ని ముందస్తు ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్ కుమార్ తో కలసి గుత్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, రిసెప్షన్ మరియు మెటీరియల్ పంపిణీ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్రాల వద్ద ఎన్నికల నిర్వహణకు కావలసిన అన్ని రకాల వసతులను త్వరితగతిన సిద్ధం చేయాలని సూచించారు. సమగ్ర మెటీరియల్ పంపిణీ ప్రక్రియ, భద్రతా చర్యలు మరియు రిసెప్షన్ సెంటర్ల వద్ద చేపట్టిన ఏర్పాట్లపై స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందికి, ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలన కార్యక్రమంలో గుంతకల్ ఆర్డీవో శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, తహసిల్దార్ పుణ్యవతితో పాటు ఇతర ఎన్నికల అధికారులు, స్థానిక సిబ్బంది పాల్గొన్నారు.

బీసీల రాజకీయ అభ్యున్నత టీడీపీతోనే సాధ్యం ఎమ్మెల్యే కాలవ

44 వేల బీసీ ఓట్లు కూటమికే..

రాయదుర్గం మున్సిపాలిటీపై పచ్చజెండా ఖాయం..



(తెలుగు కలం) అక్టోబర్ 29 : రాయదుర్గం పట్టణంలో వెనుకబడిన తరగతుల సంపూర్ణ సహకారం తెలుగుదేశం పార్టీకే ఉందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. రాయదుర్గం పట్టణంలో గురువారం 29,30,31వ వార్డుల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో టిడిపి చైర్మన్ అభ్యర్థి టంకశాల హనుమంతు తో కలిసి ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 1982లో మహనీయుడు ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన తర్వాతే బలహీన వర్గాలకు రాజకీయంగా తగిన ప్రాధాన్యత లభించిందన్నారు. అధికారంలోనూ, సంక్షేమ పథకాల అమలులోనూ బీసీలకు పెద్దపీట వేస్తూ, ఇతర సామాజిక వర్గాలకు దీటుగా వారిని అభివృద్ధి చేయాలనే దృఢ సంకల్పంతో పనిచేస్తున్న పార్టీ తెలుగుదేశమేనని పేర్కొన్నారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా బీసీల పార్టీగా తెలుగుదేశం గుర్తింపు పొందిందని, వారి రాజకీయ, సామాజిక అభ్యున్నతికి ఆది నుంచి కృషి చేస్తోందని తెలిపారు. దేశంలో బీసీలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించడంలో తెలుగుదేశం పార్టీ ప్రత్యేక గుర్తింపు సాధించిందన్నారు. రాయదుర్గం పట్టణంలో మొత్తం 53 వేల ఓట్లు ఉండగా, వాటిలో సుమారు 44 వేల ఓట్లు బీసీ సామాజిక వర్గాలకు చెందినవేనని వివరించారు. బీసీలు తెలుగుదేశం పార్టీకి అండగా నిలుస్తున్నారని, ఈ ఎన్నికల్లోనూ తమ మద్దతును చాటాలని కోరారు. కూటమి పార్టీల తరపున రాయదుర్గం మున్సిపాలిటీలోని 40 వార్డుల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులతో పాటు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి టంకశాల హనుమంతు అత్యధిక మెజారిటీతో విజయం సాధించబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమర్థవంతమైన నాయకత్వాన్ని బలపరుస్తూ, కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని పట్టణ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో, రాయదుర్గం పట్టణంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. ముఖ్యంగా బీసీలందరూ కూటమి అభ్యర్థులకు అండగా నిలవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, చైర్మన్ అభ్యర్థి టంకశాల హనుమంతు, 29వ వార్డు అభ్యర్థి కెడిమి సుమలత, 30వ వార్డు అగ్రహారం మౌనిక, 31వ వార్డు గొల్ల సావిత్రి ,32వార్డు అభ్యర్థి మురళి, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, మాజీ వైస్ చైర్మన్లు గాజుల వెంకటేశులు, కడ్డీపుడి మహబూబ్ బాషా,బంగి శంకర్,కావలి రవి,నాయకుల తిప్పేస్వామి,తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం పట్టణ సమితి సిపిఐ

రాయదుర్గం 34వ వార్డు అభివృద్ధి కోసం సీపీఐ అభ్యర్థి రవీంద్రనాథ్‌ను గెలిపించండి!

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ప్రజల మధ్యే ఉంటూ పోరాటమే మార్గం



(తెలుగు కలం) అక్టోబర్ 29 : నీటి సమస్యకు పరిష్కారం.. డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల.. రహదారుల మరమ్మతులు.. పారదర్శక పాలన.. ఇవే 34వ వార్డు ప్రజల ప్రధాన హక్కులు! రాయదుర్గం పట్టణం, 34వ వార్డు: రాయదుర్గం పట్టణంలోని 34వ వార్డు సమగ్ర అభివృద్ధి కోసం భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) కౌన్సిలర్ అభ్యర్థి ఎం. రవీంద్రనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని సీపీఐ నాయకులు వార్డు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వార్డులో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలను నేరుగా కలుసుకుని, స్థానిక సమస్యలను తెలుసుకుంటూ, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని నాయకులు హామీ ఇచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో సీపీఐ అనంతపురం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. సంజీవప్ప, రాయదుర్గం తాలూకా కార్యదర్శి నాగార్జున, ఉరవకొండ తాలూకా కార్యదర్శి చెన్నరాయుడు, దళిత హక్కుల పోరాట సమితి అనంతపురం జిల్లా కార్యదర్శి మల్లికార్జున తదితరులు పాల్గొని ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు.

34వ వార్డులో సమస్యలు పరిష్కారం కావాలి!

వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్య, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థ, దెబ్బతిన్న అంతర్గత రహదారులు, పారిశుద్ధ్య లోపాలు, చెత్త సేకరణలో ఇబ్బందులు, మురుగునీటి నిల్వలు, వీధి దీపాల సమస్యలు వంటి మౌలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. వర్షాకాలంలో మురుగునీరు నిల్వ ఉండకుండా డ్రైనేజీల మరమ్మతులు చేపట్టడం, ప్రతి వీధిలో పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడం, అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేయడం, తాగునీటి సరఫరాలో అంతరాయాలను పరిష్కరించేందుకు సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకురావడం వంటి అంశాలు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని వివరిస్తున్నారు.

మాటలు కాదు.. ప్రజా సమస్యలపై నిరంతర పోరాటమే మా విధానం!

సీపీఐ అభ్యర్థి ఎం. రవీంద్రనాథ్ మాట్లాడుతూ, "34వ వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటాను. మీ సమస్యలను నా సమస్యలుగా భావించి పరిష్కారం కోసం కృషి చేస్తాను. తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు వంటి మౌలిక సమస్యలపై సంబంధిత అధికారులతో నిరంతరం మాట్లాడటమే కాకుండా, అవసరమైతే ప్రజలను సమీకరించి ఉద్యమాలు నిర్వహిస్తాను. వార్డు అభివృద్ధి కోసం మీకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా పనిచేయడానికి నాకు ఒక అవకాశం ఇవ్వండి" అని వార్డు ప్రజలను అభ్యర్థించినట్లు నాయకులు తెలిపారు. ప్రజల సమస్యలను ఎన్నికల సమయంలో మాత్రమే గుర్తుచేసుకునే రాజకీయాలకు స్వస్తి పలకాలని, ఎన్నికల తర్వాత కూడా ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగస్వాములయ్యే నాయకులను ఎన్నుకోవాలని పిలుపునిచ్చారు. వార్డుకు సంబంధించిన సమస్యలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ, అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, మున్సిపల్ నిధులు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా వార్డును మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని తెలిపారు.

ఐదేళ్ల భవిష్యత్తును ఒక్కరోజు ప్రలోభాలకు బలి చేయవద్దు!

ఓటు అనేది కేవలం ఎన్నికల గుర్తుకు వేసే ముద్ర మాత్రమే కాదని, అది మన వార్డు భవిష్యత్తును నిర్ణయించే శక్తి అని సీపీఐ నాయకులు పేర్కొన్నారు. డబ్బు, మద్యం, ఇతర తాత్కాలిక ప్రలోభాలకు లొంగకుండా, తమ సమస్యలను అర్థం చేసుకుని ప్రజల కోసం పనిచేసే అభ్యర్థిని ఎన్నుకోవాలని కోరారు. ప్రస్తుత అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులు వార్డు సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని ప్రజలు ప్రశ్నించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలకంటే ప్రజలకు అందించిన సేవలను ప్రాతిపదికగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అయితే, ఏ పార్టీ అధికారంలో ఉన్నా ప్రజలకు తాగునీరు, రహదారులు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం వంటి కనీస సదుపాయాలు అందడం ప్రజల హక్కు అని స్పష్టం చేశారు. "మన ఓటు మన హక్కు.. మన వార్డు అభివృద్ధి మన లక్ష్యం.. ప్రజల కోసం నిలబడే నాయకుడే మనకు అవసరం" అనే సందేశంతో 34వ వార్డు ప్రజలు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని నాయకులు కోరారు.

కంకి కొడవలి గుర్తుకు ఓటు వేయండి!

34వ వార్డు అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం కోసం సీపీఐ కౌన్సిలర్ అభ్యర్థి ఎం. రవీంద్రనాథ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని, కంకి కొడవలి గుర్తుకు ఓటు వేసి ప్రజా పోరాటాలకు బలం చేకూర్చాలని సీపీఐ నాయకులు 34వ వార్డు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

ప్రజలే బలం -- ప్రజా సమస్యలే ఎజెండా -- వార్డు అభివృద్ధే లక్ష్యం!

ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిపిఐ నాయకులు గౌస్ పీరా సుల్తాన్ తిప్పే స్వామి కోష్టేష్ అమిదాబి అంజనేయులు మంతేష్ జితేంద్ర మంజునాథ్ నజ్జప్ప సదాశివ రెడ్డి మహేంద్ర వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు

సైకిల్ స్పీడ్‌కు వార్డులో ప్రచార వేడి.... వెంకటేష్, యశోదమ్మ విజయమే టీడీపీ లక్ష్యం...!

అభివృద్ధి హామీలతో ప్రజల్లోకి టీడీపీ..

గాజుల వెంకటేష్, యశోదమ్మకు ఓటేయాలని అభ్యర్థన!

ఇంటింటి ప్రచారంతో ఓటర్లను కలుస్తున్న టీడీపీ అభ్యర్థులు



గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 29 : గుంతకల్లు పట్టణంలోని 12వ వార్డులో తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గాజుల వెంకటేష్, మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి యశోదమ్మ కలిసి వార్డులోని వివిధ వీధులు, కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓటర్లను కలుస్తున్నారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వార్డు అభివృద్ధికి కృషి చేసే టీడీపీ అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మౌలిక సదుపాయాల కల్పనే ప్రధాన లక్ష్యం :-

వార్డులో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, తాగునీటి సమస్యల పరిష్కారం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని టీడీపీ అభ్యర్థులు ప్రచారంలో వివరిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గుంతకల్లు పట్టణంలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి పనులు జరగలేదని విమర్శిస్తూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొంటున్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తాం :-

తెలుగుదేశం పార్టీ పాలనలో పట్టణంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం సహా పలు అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇచ్చామని అభ్యర్థులు చెబుతున్నారు. రానున్న రోజుల్లోనూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, వార్డును అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని వివరిస్తున్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా.. గాజుల వెంకటేష్ :-

తనకు ఓటు వేసి గెలిపిస్తే వార్డు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కౌన్సిలర్ అభ్యర్థి గాజుల వెంకటేష్ ఓటర్లకు హామీ ఇస్తున్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, వార్డులో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని ప్రచారంలో తెలియజేస్తున్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి :-

12వ వార్డులో గాజుల వెంకటేష్‌ను కౌన్సిలర్‌గా, యశోదమ్మను మున్సిపల్ చైర్మన్‌గా గెలిపిస్తే వార్డు అభివృద్ధికి మరింత కృషి చేసే అవకాశం ఉంటుందని టీడీపీ శ్రేణులు ఓటర్లకు వివరిస్తున్నాయి. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని పేర్కొంటూ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాల మెరుగుదల కోసం టీడీపీ అభ్యర్థులకు మద్దతు తెలిపి గెలిపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కళ్యాణదుర్గం రాజకీయాల్లో తీవ్ర కలకలం

టీడీపీ మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థి బుట్టా లక్ష్మిపై

ఎలక్షన్ కమిషన్‌కు మాజీ ఎంపీ తలారి రంగయ్య ఫిర్యాదు!

కళ్యాణదుర్గం (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మున్సిపల్ రాజకీయాలు ఒక్కసారిగా తీవ్ర ఉత్కంఠకు దారితీశాయి. తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరపున మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా బరిలోకి దిగిన బుట్టా లక్ష్మీ తిమ్మరాజుకు విదేశీ పౌరసత్వ ముప్పు పొంచి ఉందంటూ అనంతపురం మాజీ ఎంపీ తలారి రంగయ్య సంచలన ఆరోపణలు చేశారు. శ్రీలంకలో పుట్టి పెరిగిన విదేశీయురాలైన బుట్టా లక్ష్మిని మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఎన్నుకోవడానికి వీల్లేదని, ఆమె ఈ పదవికి పూర్తిగా అనర్హురాలని స్పష్టం చేస్తూ మాజీ ఎంపీ ఎలక్షన్ అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేశారు. గురువారం రోజున కళ్యాణదుర్గంలోని స్థానిక మున్సిపల్ ఎన్నికల అధికారికి స్వయంగా వినతిపత్రం సమర్పించిన తలారి రంగయ్య, ఈ వివాదాన్ని స్థానిక స్థాయికే పరిమితం చేయకుండా జిల్లా ఎన్నికల అధికారి, రాష్ట్ర ఎన్నికల కమిషనర్, అలాగే జాతీయ ఎన్నికల కమిషన్‌లకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడించారు.

భారతదేశ పౌరసత్వం లేని వ్యక్తికి స్థానిక సంస్థల అత్యున్నత పీఠాన్ని అప్పగించడం చట్టవిరుద్ధమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా చారిత్రక రాజకీయాంశాలను గుర్తుచేసిన మాజీ ఎంపీ తలారి రంగయ్య, 2004లో సోనియా గాంధీ విదేశీయురాలు అన్న కారణంతోనే నాటి బీజేపీ నాయకురాలు సుష్మా స్వరాజ్ ఆమె ప్రధాని పదవిని చేపట్టకూడదని పెద్ద ఎత్తున నిరసన గళమెత్తారని ఉదాహరించారు. అదే సూత్రాన్ని ఇక్కడ కూడా వర్తింపజేయాలని, శ్రీలంక మూలాలు ఉన్న బుట్టా లక్ష్మిని కళ్యాణదుర్గం మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి పూర్తిగా అనర్హురాలిగా ప్రకటించి ఆమె నామినేషన్‌ను, అభ్యర్థిత్వాన్ని రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఫిర్యాదుతో కళ్యాణదుర్గం స్థానిక ఎన్నికల సమరం మునుపెన్నడూ లేనంత వేడెక్కింది.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక

శుక్రవారం 30 - 10 - 2026

కూటమి పాలనలోనే సమగ్ర అభివృద్ధి, సంక్షేమం టీడీపీ, బీజేపీ నేతల ధీమా



కర్నూలు అక్టోబర్ 29 (తొలివార్త):ప్రతినిధి : కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం, రాష్ట్రంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి, రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నాయని కర్నూలు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు గుడిసె ఆది కృష్ణమ్మ, భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ సంయుక్తంగా స్పష్టం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న సమర్థవంతమైన సమన్వయం వల్ల సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజలకు అందడమే కాకుండా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన వేగవంతమవుతోందని వారు తెలిపారు. స్థానిక సంస్థలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా 16వ ఆర్థిక సంఘం ద్వారా రాష్ట్రానికి రూ. 12,600 కోట్ల నిధులను కేటాయించారని వారు వివరించారు. ఈ నిధులను గ్రామాలు, పట్టణాల్లో మౌలిక వసతుల మెరుగుదలకు పూర్తిస్థాయిలో వినియోగించి ప్రజలకు మెరుగైన రవాణా, పారిశుద్ధ్య, తాగునీటి సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రాంతాల రూపురేఖలు మార్చేందుకు అమృత్ 2.0 తో పాటు ఇతర పట్టణాభివృద్ధి పథకాల ద్వారా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామని వెల్లడించారు. రైతాంగానికి అండగా నిలవడమే కూటమి ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని నాయకులు స్పష్టం చేశారు. పంటలకు గిట్టుబాటు ధరల కల్పన, సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, వ్యవసాయ అనుబంధ వసతుల అభివృద్ధితో పాటు ప్రకృతి వైపరీత్యాల వేళ నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు శాస్త్రీయ పద్ధతిలో పంట నష్టాన్ని అంచనా వేసి త్వరితగతిన పరిహారం అందిస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారతకు ప్రాధాన్యమిస్తూ స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేయడం, వారికి ఉపాధి మార్గాలు చూపడం ద్వారా ఆర్థిక స్వావలంబన చేకూరుస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో పాటు, బీసీ రక్షణ చట్టం ద్వారా ఆయా వర్గాల రాజకీయ, సామాజిక హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని వివరించారు. పేదల సొంతింటి కల నెరవేర్చడం, రహదారుల నిర్మాణ వేగం పెంచడం, తాగునీటి వసతులు కల్పించడం ద్వారా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తూ సంక్షేమాన్ని ప్రతి ఇంటికీ చేర్చుతామని వారు పునరుద్ఘాటించారు.

కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఎమ్మెల్యే ప్రచారం





యాడికి (తెలుగు కలం) అక్టోబర్ 29 : అనంతపురం జిల్లా యాడికి మండల కేంద్రంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి గురువారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పాత పోలీస్ స్టేషన్ వీధి, లాలాల వీధి, కోటవీధి, లాలప్ప వీధి, ఆర్యవైశ్య వీధుల్లో పర్యటించి ప్రజలను కలిశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రచారంలో భాగంగా స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో టీడీపీ సీనియర్ నాయకులు చవ్వా గోపాల్ రెడ్డి, రుద్రమ నాయుడు,ఎంపీపీ అభ్యర్థి రవికుమార్ రెడ్డి,జడ్పీటీసీ అభ్యర్థి వేలూరు రంగయ్య, మండల కన్వీనర్ దడియాల ఆదినారా యణ, జనసేన మండల కన్వీనర్ కోడి సునీల్ కుమార్ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఫఠాన్ రజియా విస్తృత ఇంటింటి ప్రచారం





యాడికి (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : స్థానిక సంస్థల ఎన్నికల ప్రచారంలో భాగంగా యాడికి మండల కేంద్రంలోని 5వ వార్డు (ఫీజు-5) వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఫఠాన్ రజియా తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. గురువారం యాడికి మండల కేంద్రంలో ఉన్న హాస్పిటల్ కాలనీలో ఆమె విస్తృత ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి ఫఠాన్ రజియా కాలనీలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను ప్రత్యక్షంగా కలుసుకున్నారు. పార్టీ మేనిఫెస్టో, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు అయిన ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి, భారీ మెజారిటీతో తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. ప్రచారంలో భాగంలో స్థానిక ప్రజలతో మమేకమవుతూ వారి సమస్యలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు ఫఠాన్ ఫరూక్, శివప్రసాద్‌తో పాటు ఇతర స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు మరియు అభిమానులు పాల్గొని అభ్యర్థికి మద్దతు తెలిపారు.

18వ వార్డు అభివృద్ధే లక్ష్యం

స్వతంత్ర అభ్యర్థి బండి జయప్రకాష్ హామీ



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మున్సిపాలిటీ 18వ వార్డు అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే తన ప్రధాన ధ్యేయమని స్వతంత్ర కౌన్సిలర్ అభ్యర్థి బండి జయప్రకాష్ తెలిపారు. బండి చిన్న సంజీవప్ప మనవడిగా, బండి హరినాథ్ కుమారుడిగా రాజకీయ పార్టీలకు అతీతంగా బరిలో నిలిచినట్లు పేర్కొన్న ఆయన, నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తానని హామీ ఇచ్చారు. వార్డులో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుదల, క్రమబద్ధమైన చెత్త సేకరణ, స్వచ్ఛమైన తాగునీరు, వీధి దీపాల ఏర్పాటుతో పాటు దెబ్బతిన్న రహదారుల మరమ్మతులు, ప్రమాదకర వేలాడే విద్యుత్ వైర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ధర్మవరం పట్టుచీరలకు ఉన్న ప్రత్యేక గుర్తింపును ప్రస్తావిస్తూ, 18వ వార్డులోని పట్టు వస్త్రాల దుకాణాలకు వచ్చే వినియోగదారులు, స్థానిక వ్యాపారులకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. పదవుల కోసం కాకుండా ప్రజాసేవే లక్ష్యంగా పోటీ చేస్తున్న తనను క్రికెట్ బ్యాట్ గుర్తుపై, సీరియల్ నంబర్ 4 వద్ద ఓటు వేసి గెలిపించాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు.

కంచిలిలో ఆర్ణబ్ తుపాను బీభత్సం 1,900కు పైగా

కొబ్బరి చెట్లు నేలమట్టం, లబోదిబోమంటున్న రైతాంగం

కంచిలి **(తెలుగు కలం) అక్టోబర్ 29 :** ప్రతినిధి : ఆర్ణబ్ తుపాను ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులకు శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలంలో కొబ్బరి రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలుల ధాటికి కొబ్బరి తోటలు దెబ్బతిని పెద్ద సంఖ్యలో చెట్లు నేలకొరగడంతో తమ జీవనాధారం దెబ్బతిందని స్థానిక రైతాంగం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది. ఉద్యాన శాఖ అధికారులు నిర్వహించిన ప్రాథమిక సర్వే ప్రకారం.. మండలంలోని తలతంపర, శ్రీరాంపురం, మకరంపురం, కొక్కిలిపుట్టుగ, జాదుపూడి తదితర గ్రామాల్లో సుమారు 1,250 మంది రైతులకు చెందిన 1,925 కొబ్బరి చెట్లు గాలుల ధాటికి నేలమట్టమయ్యాయి. తుపాను బాధితులను పరామర్శించేందుకు ఉద్యాన శాఖ అధికారులు పలు గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టపోయిన తోటలను పరిశీలించారు. నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపించినట్లు కంచిలి ఉద్యాన అధికారి మాధవీ లత వెల్లడించారు. ఒక్కసారిగా కొబ్బరి చెట్లు కూలిపోవడంతో తీవ్ర ఆర్థిక నష్టాల్లో కూరుకుపోయిన తమను ప్రభుత్వం ఆదుకోవాలని, తక్షణమే పరిహారం అందించాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కర్ణాటక ఎక్స్‌ప్రెస్‌లో విషాదం

సీట్లోనే అచేతనంగా పడిపోయి ప్రయాణికుడి మృతి



ధర్మవరం (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం రైల్వే స్టేషన్ పరిధిలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. రైలు ప్రయాణంలో ఓ వ్యక్తి హఠాత్తుగా అస్వస్థతకు గురై తానెక్కిన సీట్లోనే తుదిశ్వాస విడిచాడు. పోలీసులు, రైల్వే వర్గాలు వెల్లడించిన కథనం ప్రకారం.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన అజయ్ కుమార్ (36) అనే వ్యక్తి బాంద్రా నగరం నుంచి బెంగళూరు వెళ్లేందుకు కర్ణాటక ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణం ప్రారంభించాడు. మార్గమధ్యంలో రైలు శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం స్టేషన్‌కు చేరుకునే క్రమంలో ఆయన తన సీట్లోనే ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. సహచర ప్రయాణికులు గమనించి వెంటనే రైల్వే అధికారులకు సమాచారం అందించారు. రైలు ధర్మవరం స్టేషన్‌లో ఆగగానే అప్రమత్తమైన సిబ్బంది, వైద్య బృందం ఆయన్ను పరిశీలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. హఠాన్మరణానికి గల కారణాలపై సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించేందుకు చర్యలు చేపట్టారు.

స్థానిక ఎన్నికల్లో ప్రజాభద్రత కోసం

అనంతపురంలో 'మైన్స్ ప్రూఫ్' వాహనం సిద్ధం



అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 29 :ప్రతినిధి : జిల్లాలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు మరియు శాంతిభద్రతలను కాపాడేందుకు పోలీసు శాఖ అత్యాధునిక రక్షణ చర్యలను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా అల్లరి మూకలను అదుపు చేసేందుకు మరియు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు వీలుగా సిద్ధం చేసిన మైన్స్ ప్రూఫ్ రక్షణ వాహనాన్ని అనంతపురం జిల్లా ఎస్పీ పి. జగదీశ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో ఎలాంటి హింసాత్మక ఘటనలు ఎదురైనా పోలీసు సిబ్బంది సురక్షితంగా మరియు వేగంగా స్పందించేందుకు ఈ వాహనం ఎంతో దోహదపడుతుందని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడటమే తమ ప్రధాన లక్ష్యమని, అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి భయాందోళనలు లేకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అనంతపురం జిల్లాలో విషాదం

రైలు ఢీకొని రెండు ఎలుగుబంట్లు మృతి



డి.హీరేహాల్ (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : అనంతపురం జిల్లా డి.హిరేహాల్ మండల పరిధిలోని కల్యం గ్రామ సమీపంలో గురువారం వేకువజామున తీవ్ర విషాదకర ఘటన చోటుచేసు కుంది. పట్టాలు దాటుతుండగా వేగంగా వచ్చిన రైలు ఢీకొనడంతో రెండు ఎలుగుబంట్లు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాయి. ఉదయాన్నే రైల్వే ట్రాక్‌పై రక్తసిక్తమై పడి ఉన్న ఎలుగుబంట్ల కళేబరాలను గమనించిన కల్యం గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే ఈ సమాచారాన్ని రాయదుర్గం అటవీశాఖ అధికారులు మరియు రైల్వే పోలీసులకు అందించారు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారులు, సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆహారం, నీటి అన్వేషణలో భాగంగా సమీప గుట్టల నుంచి అడవి దాటి వస్తుండగా ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు. ఘటనా స్థలంలో పంచనామా నిర్వహించిన అధికారులు, కళేబరాలకు పోస్టుమార్టం పూర్తి చేసిన అనంతరం అటవీ నిబంధనల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఘటనపై రైల్వే పోలీస్, ఫారెస్ట్ అధికారులు కేసు నమోదు చేసి తదుపరి విచారణ జరుపుతున్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ-1 అభ్యర్థి ఇంటింటి ప్రచారం



యాడికి (తెలుగు కలం) అక్టోబర్ 29 : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీటీసీ-1 అభ్యర్థి జూటూరు భాస్కర్ రెడ్డి గురువారం యాడికి మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను ఆశీర్వ దించాలని కోరారు. స్థానిక ప్రజలతో మమేక మవుతూ ఎన్నికల ప్రచారాన్ని కొనసాగించారు.ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు రమణ , శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ఓటు అవకాశం

యాడికి (తెలుగు కలం) అక్టోబర్ 29 :ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1 వరకు అవకాశం కల్పించినట్లు యాడికి మండల రిటర్నింగ్ అధికారి షమీం బాషా గురువారం తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకోవాలనుకునే ఉద్యోగులు యాడికి ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటు వేయవచ్చని ఆయన పేర్కొన్నారు.

పుట్లూరులో వైఎస్సార్‌సీపీ జోష్.. సురేపల్లిలో పలు కుటుంబాల చేరిక..!

ఎంపీటీసీ అభ్యర్థి తలారి జయకృష్ణకు మద్దతుగా ప్రచారం చేసిన మాజీ మంత్రి శైలజానాథ్



పుట్లూరు (తెలుగు కలం) అక్టోబర్ 29 : పుట్లూరు మండలం కడపకల్లు గ్రామంలో వైఎస్సార్‌సీపీ ప్రచారం జోరుగా సాగింది. స్థానిక ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామ ఎంపీటీసీ అభ్యర్థి తలారి జయకృష్ణకు మద్దతుగా నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో సింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్ పాల్గొన్నారు. అభ్యర్థితో కలిసి గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను కలిసిన ఆయన,గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమలైన సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పుట్లూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పొన్నపాటి మహేశ్వర్‌రెడ్డితో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.గ్రామం లో ఇంటింటి ప్రచారంతో ఎన్నికల సందడి నెలకొంది.

స్థానిక సంస్థల ఎన్నికల వేళ దివ్యాంగులకు బిగ్ రిలీఫ్

సదరమ్ స్లాట్ల విడుదలకు రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్

అనంతపురం (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా అర్హులైన వివిధ ప్రతిభావంతులకు (దివ్యాంగులకు) వైద్య పరీక్షలు నిర్వహించి సదరమ్ **(SADAREM)** ధృవీకరణ పత్రాలు అందజేసే ప్రక్రియకు కీలక ముందడుగు పడింది. 2026 స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నప్పటికీ, సాధారణ సదరమ్ స్లాట్ల విడుదలకు మరియు వైద్య పరీక్షల శిబిరాల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చింది. దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని వైద్య పరీక్షల శిబిరాల నిర్వహణ కోసం సదరమ్ స్లాట్లను విడుదల చేయడానికి అనుమతిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అక్టోబర్ 24, 2026న అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ స్లాట్ల నిర్వహణ సాధారణ పరిపాలనా ప్రక్రియలో భాగమని, దీనివల్ల ఎన్నికల కోడ్‌కు ఎలాంటి భంగం వాటిల్లదని స్పష్టం చేశారు. అయితే, ఈ మొత్తం ప్రక్రియలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన అనుమతి ఆధారంగా, సదరమ్ సర్టిఫికెట్లు లేని అర్హులైన దివ్యాంగులందరూ వైద్య పరీక్షల కోసం ముందస్తుగా దరఖాస్తు చేసుకోవచ్చని అనంతపురం మరియు శ్రీ సత్యసాయి జిల్లాల విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు వెల్లడించారు. దరఖాస్తు చేసుకున్న వారికి నిర్దేశిత కేంద్రాల్లో నిపుణులైన వైద్యుల ద్వారా పరీక్షలు నిర్వహించి వైకల్య నిర్ధారణ సర్టిఫికెట్లు అందజేస్తారు. ఈ ప్రత్యేక అవకాశాన్ని అర్హులైన దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. వైద్య పరీక్షల ప్రక్రియలో దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేదా అసౌకర్యం కలగకుండా అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈ సదరమ్ ధృవీకరణ పత్రాల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పింఛన్లు, రాయితీలు మరియు ఇతర సేవలను సులభంగా పొందే వీలు కలుగుతుంది.

నవంబర్ 1న ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో

దుకాణాలు, వాణిజ్య సంస్థలకు వేతనంతో కూడిన సెలవు



అనంతపురము (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ చట్టం, 1988 ప్రకారం నవంబర్ 1వ తేదీన అర్బన్ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికలు జరగనున్న ప్రాంతాల్లోని దుకాణాలు, వాణిజ్య సంస్థల ఉద్యోగులు మరియు కార్మికులకు వేతనంతో కూడిన సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా ఉప కార్మిక కమిషనర్ లక్ష్మీ నరసయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ కార్మిక శాఖ కమిషనర్ (విజయవాడ) జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, అనంతపురము మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు గుత్తి, తాడిపత్రి, గుంతకల్లు, కళ్యాణదుర్గం మరియు రాయదుర్గం మున్సిపాలిటీల పరిధిలోని వ్యాపార, వాణిజ్య సంస్థల యాజమాన్యాలు తమ వద్ద పనిచేస్తున్న సిబ్బందికి వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాల్సి ఉంటుంది. ఉద్యోగులు, కార్మికులు ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగస్వాములై తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునేందుకు వీలుగా యాజమాన్యాలు పూర్తిగా సహకరించాలని ఆయన కోరారు.

వాటర్ సప్లయ్ స్కీమ్ కార్మికుల వేతన

బకాయిలకు రూ.18 కోట్లు మంజూరు



ధర్మవరం(తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్ **(SSVSSP)**లో పనిచేస్తున్న కార్మికులకు గత కొన్ని నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతన బకాయిల చెల్లింపునకు రాష్ట్ర ప్రభుత్వం రూ.18 కోట్ల నిధులను మంజూరు చేసింది. రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం ఎమ్మెల్యే శ్రీ సత్యకుమార్ యాదవ్ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి కార్మికుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో ఈ నిధుల మంజూరుకు మార్గం సుగమమైంది. నెలల తరబడి జీతాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పెద్ద ఊరటనివ్వనుంది. శ్రీ సత్యసాయి వాటర్ సప్లయ్ స్కీమ్‌లో పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు అందక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన మంత్రి సత్యకుమార్ యాదవ్, ఈ సమస్య పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ప్రజలకు నిరంతర తాగునీటి సరఫరా అందించడంలో వాటర్ సప్లయ్ స్కీమ్ కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారు. నిరంతరం విధులను నిర్వర్తిస్తూ ప్రజలకు సేవలందిస్తున్న కార్మికులకు వేతనాలు నిలిచిపోవడంతో వారి కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, వారికి రావాల్సిన బకాయిలు తక్షణమే చెల్లించేలా నిధులు మంజూరయ్యేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ చర్యలు చేపట్టారు.

హాస్పిటల్ కాలనీలో నంద్యాల ఆదిలక్ష్మి ఎన్నికల ప్రచారం



యాడికి (తెలుగు కలం) అక్టోబర్ 29 : యాడికి ఐదో ఎంపీటీసీ స్థానానికి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలిచిన నంద్యాల ఆదిలక్ష్మి , జెడ్పీటీసీ అభ్యర్థి వేలూరు రంగయ్య గురువారం యాడికి మండల కేంద్రంలోని శ్రీరామ్ నగర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు..ఈ సందర్భంగా నంద్యాల ఆదిలక్ష్మి భర్త నంద్యాల రంగస్వామితో పాటు యాడికి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించా రు.కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వదిం చాలని నంద్యాల ఆదిలక్ష్మి ఓటర్లను కోరారు.ఈ ప్రచార కార్యక్రమం లో పెయింటర్ విజయ్,బాలం శ్రీనివాసులు,చిట్టెపు చంద్రశేఖరెడ్డి, కూనా వెంకటస్వామి,పూలతోట చంద్ర, ముని, తదితర టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మిషన్ ఇంద్రధనుష్, ఏబీ-పీఎంజేవై

అమలుపై కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ సమీక్ష

అర్హులందరికీ ప్రభుత్వ వైద్య సేవలు అందాలి



పుట్టపర్తి (తెలుగు కలం) అక్టోబర్ 29 : ప్రతినిధి : శ్రీసత్యసాయి జిల్లాలో వైద్యారోగ్య రంగంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రభుత్వ ఆరోగ్య పథకాలు అర్హులందరికీ అందాలని జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ స్పష్టం చేశారు. గురువారం పుట్టపర్తిలోని కలెక్టరేట్ కలెక్టర్ ఛాంబర్‌లో శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన మిషన్ ఇంద్రధనుష్, ప్రధాన మంత్రి జన ఆరోగ్య యోజన **(AB-PM-JAY)** అలాగే జిల్లాలో హెచ్ఐవి పరిస్థితిపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో చిన్నపిల్లలు మరియు గర్భిణీ స్త్రీలకు నిర్దేశిత టీకాలను అందించడం, టీకాలు అందని వారిని గుర్తించడంపై చర్చించారు. వంద శాతం టీకాల లక్ష్య సాధనకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అలాగే అర్హులైన లబ్ధిదారులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంతో పాటు, ఆరోగ్య పథకాలపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించి ప్రతి ఒక్కరికీ ప్రయోజనాలు అందేలా చూడాలని పేర్కొన్నారు. జిల్లాలో హెచ్ఐవి నివారణ, పరీక్షలు, కౌన్సెలింగ్, చికిత్స సేవలు మరియు ప్రజల్లో అవగాహన కార్యక్రమాల అమలు తీరును కలెక్టర్ సమీక్షించారు. హెచ్ఐవి బాధితులకు ఎలాంటి వివక్ష లేకుండా వైద్య సేవలు అందించాలని, వారికి అవసరమైన చికిత్సను నిరంతరం కొనసాగించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను నిర్దేశిత సమయంలో సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో డిఎండహెచ్ఓ ఫైరోజా బేగం, ఐసీడీఎస్ పిడి ప్రమీల, సీడీపీఓలు, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారి మరియు వివిధ వైద్యాధికారులు పాల్గొన్నారు.

గుంతకల్లులో కూటమి ఎన్నికల సమరభేరి.. యశోదమ్మ గెలుపే లక్ష్యంగా భారీ ర్యాలీ...!

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం,

మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో ప్రచార హోరు

సీసీ రోడ్లు, పైప్‌లైన్లు, తాగునీటి పనుల ప్రస్తావన..

సంక్షేమ పథకాలతో ప్రజల్లోకి నేతలు

యశోదమ్మకు భారీ మెజారిటీ అందించండి..

కూటమి అభ్యర్థులను గెలిపించాలని నాయకుల విజ్ఞప్తి





గుంతకల్లు (తెలుగు కలం) అక్టోబర్ 29 :గుంతకల్లు మున్సిపల్ ఎన్నికల వేళ పట్టణంలో రాజకీయ వేడి పెరిగింది. చైర్మన్ అభ్యర్థి యశోదమ్మ గెలుపే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని కూటమి ప్రచారాన్ని ఉధృతం చేసింది. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, మాజీ ఎమ్మెల్యే జితేంద్ర గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బహిరంగ ర్యాలీతో కూటమి నాయకులు ఎన్నికల ప్రచారాన్ని మరింత వేగవంతం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని, యశోదమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని ఓటర్లను కోరారు.పట్టణంలోని కసాపురం రోడ్డులో ఉన్న వాల్మీకి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ర్యాలీ ప్రారంభమైంది. అక్కడి నుంచి ఎన్టీఆర్ సర్కిల్ మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ర్యాలీ సాగింది. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొంటూ కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా ప్రజలను కలిశారు. పట్టణంలో ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులను వివరిస్తూ, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలపై నేతలు ప్రజలకు వివరించారు.

అభివృద్ధి పనులే ప్రచారంలో ప్రధానాస్త్రం :-

గుంతకల్లు పట్టణంలో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణం, పైప్‌లైన్ల ఏర్పాటు, తాగునీటి సరఫరా మెరుగుదల వంటి పనులను నాయకులు ప్రధానంగా ప్రస్తావించారు. ఇప్పటికే పూర్తయిన పనులతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ, మిగిలిన పనులను కూడా పూర్తి చేసి పట్టణానికి మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి ప్రజల నిత్యజీవితానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

ఏడు రోజుల నిరీక్షణ నుంచి నాలుగు రోజులకోసారి నీరు.. మరింత మెరుగైన సరఫరాకు చర్యలు :-



తాగునీటి సరఫరాపై నాయకులు ప్రత్యేకంగా ప్రస్తావించారు. గతంలో పట్టణ ప్రజలు ఏడు రోజులకోసారి నీరు అందడంతో ఇబ్బందులు ఎదుర్కొనేవారని, ప్రస్తుతం నాలుగు రోజులకోసారి సరఫరా జరుగుతోందని వివరించారు. మూడో నీటి నిల్వ ట్యాంకు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొంటూ, రానున్న రోజుల్లో రెండు రోజులకోసారి తాగునీరు అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తగ్గించి, సరఫరాను మరింత మెరుగుపరచడమే లక్ష్యమని వెల్లడించారు.

సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువ.. హామీల అమలుపై నేతల వివరణ :-

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కూడా నాయకులు ప్రజలకు వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు పింఛన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం, తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సాయం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలు సమాంతరంగా కొనసాగితేనే పట్టణ ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు.

యశోదమ్మకు మద్దతివ్వండి.. అభివృద్ధి కొనసాగింపునకు సహకరించండి :-

మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి యశోదమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని నాయకులు ఓటర్లను కోరారు. ప్రతి వార్డులో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు.గుంతకల్లు పట్టణ అభివృద్ధి, తాగునీటి సరఫరా మెరుగుదల, రహదారులు, పారిశుధ్యం వంటి అంశాలను ప్రజల ముందుంచుతూ కూటమి నాయకులు ప్రచారాన్ని కొనసాగించారు. మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని, యశోదమ్మను భారీ మెజారిటీతో గెలిపించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, కూటమి శ్రేణులు, అభిమానులు పాల్గొన్నారు.

102 ఉద్యోగాలకు టీజీపీఎస్సీ నోటిఫికేషన్

విద్యార్హతలు, జీతం వివరాలు ఇవే

అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది

అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు దరఖాస్తులను స్వీకరించనుంది

రాష్ట్రంలోని నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. మండల ప్లానింగ్ అండ్ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, డైరెక్టరేట్ ఆఫ్ ఎకనమిక్స్ అండ్ స్టాటిస్టిక్స్‌లో అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం ప్రకటన జారీ చేసింది.102 ఉద్యోగాల భర్తీకి అక్టోబర్ 30 నుంచి నవంబర్ 27 వరకు అర్హత ఉన్నవారు అప్లై చేసుకోవాలని సూచించింది. పరీక్ష జనవరిలో జరిగే అవకాశం ఉందని, 7 రోజుల ముందుగానే హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కల్పిస్తామని ఓ ప్రకటనలో తెలిపింది. ఆఖరి తేదీ వరకు వేచి ఉండకుండా, అభ్యర్థులు ముందుగానే అప్లికేషన్లను సమర్పించాలని ఈ సందర్భంగా సూచించింది.స్టాటిస్టిక్స్ ప్రధాన సబ్జెక్టుగా డిగ్రీ కోర్సు చేసిన వారు ఈ పోస్టులకు అప్లై చేసుకోవచ్చని పబ్లిక్ సర్వీస్ కమిషన్ తెలిపింది. దరఖాస్తు రుసుము ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.1000 కాగా, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు రూ.500గా నిర్ణయించింది. అభ్యర్థుల వయసు 2026 జులై 1 నాటికి 18 నుంచి 44 ఏళ్లు మించరాదని ప్రకటనలో పేర్కొంది.ఆయా సామాజిక వర్గాలకు రిజర్వేషన్ల ఆధారంగా వయో పరిమితిలో ప్రత్యేక సడలింపు ఉంటుంది. ఉద్యోగాలకు ఎంపికైన వారికి వేతన పే స్కేలు రూ.36,750 – రూ.1,06,990గా ఉంటుందని తెలిపింది. పోస్టుల ఎంపిక ప్రక్రియ ఎలా ఉంటుంది, జోన్ల వారీగా ఖాళీలు ఎన్ని ఉన్నాయి పరీక్ష విధానం ఏంటి సిలబస్, ఎలా దరఖాస్తు చేసుకోవాలి తదితర పూర్తి వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి.ఇక నుంచి కంప్యూటర్ ఆధారిత పరీక్షల విధానంలో గ్రూప్-1, 2, 3, 4 పరీక్షలు జరుగుతాయని టీజీపీఎస్సీ కమిషన్ ఛైర్మన్ బుర్రా వెంకటేశం వెల్లడించారు.

ఒకే రోజు 9 వార్డుల్లో విప్ కాలవ, చైర్మన్ అభ్యర్థి టంకశాల సుడిగాలి పర్యటన

పట్టణంలో 44 వేల బీసీ ఓట్లు కూటమికే

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు ధీమా

రేపు ముగియనున్న ప్రచారం.. భారీ రోడ్ షోకు ఏర్పాట్లు



రాయదుర్గం (తెలుగు కలం) అక్టోబర్ 29 : రాయదుర్గం మున్సిపల్ ఎన్నికల సమరం క్లైమాక్స్‌కు చేరింది. ప్రచార గడువు ముగియడానికి కేవలం ఒక్క రోజే మిగిలి ఉండటంతో పట్టణంలో రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. కూటమి తరఫున టీడీపీ చైర్మన్ అభ్యర్థి టంకశాల హనుమంతుతో కలిసి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గురువారం ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తించారు. ఒకే రోజు ఏకంగా 9 వార్డుల్లో పర్యటించి ప్రత్యర్థులకు చెమటలు పట్టించారు.?పట్టణంలోని 2, 3, 4, 5, 6, 7తో పాటు 29, 30, 31వ వార్డుల్లో అభ్యర్థులు, కూటమి శ్రేణులతో కలిసి కాలవ శ్రీనివాసులు, టంకశాల హనుమంతు విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాలనీల్లోకి అడుగుపెట్టిన నేతలకు స్థానిక ప్రజలు, మహిళలు హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ప్రజలతో ఆప్యాయంగా మాట్లాడుతూ, వార్డుల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాయదుర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను, భవిష్యత్తులో ప్రతి వార్డులో అమలు చేయబోయే సంక్షేమ పథకాలను ఓటర్లకు స్పష్టంగా వివరించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ, రాయదుర్గం పట్టణంలో వెనుకబడిన తరగతుల సంపూర్ణ మద్దతు తెలుగుదేశం పార్టీకే ఉందని స్పష్టం చేశారు. 1982లో మహనీయుడు నందమూరి తారకరామారావు టీడీపీని స్థాపించిన తర్వాతే బలహీన వర్గాలకు నిజమైన రాజకీయ ప్రాధాన్యత, గుర్తింపు దక్కాయని గుర్తుచేశారు. అధికారంలోనైనా, సంక్షేమ పథకాల అమలులోనైనా బీసీలకు పెద్దపీట వేస్తూ వస్తున్నామని పేర్కొన్నారు. గత నాలుగున్నర దశాబ్దాలుగా బీసీల సామాజిక, రాజకీయ ఎదుగుదలకు కృషి చేసిన ఏకైక పార్టీ టీడీపీయేనని కొనియాడారు.?రాయదుర్గం పట్టణంలో మొత్తం 53 వేల ఓట్లు ఉండగా, అందులో సుమారు 44 వేల ఓట్లు బీసీ వర్గాలవేనని ఆయన గణాంకాలతో వివరించారు. దశాబ్దాలుగా టీడీపీకి అండగా నిలుస్తున్న బీసీలు ఈ ఎన్నికల్లోనూ భారీగా మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలోని 40 వార్డుల్లోనూ కూటమి కౌన్సిలర్ అభ్యర్థులతో పాటు చైర్మన్ అభ్యర్థి టంకశాల హనుమంతు చారిత్రాత్మక మెజారిటీతో విజయం సాధించడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రేపు భారీ రోడ్ షో

ఎన్నికల ప్రచారానికి శుక్రవారం ఆఖరి రోజు కావడంతో రాయదుర్గంలో బలం చాటేందుకు కూటమి భారీ రోడ్ షోకు సమాయత్తమవుతోంది. వేలాది మంది కార్యకర్తలు, ప్రజలతో పట్టణ ప్రధాన వీధుల్లో ప్రదర్శన నిర్వహించేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేశారు.

తిరుమల సమాచారం10 కంపార్ట్‌మెంట్లలో భక్తులు, సిఫార్సు లేఖల రద్దు

శ్రీవారి సర్వదర్శనానికి సుమారు 8 గంటల సమయం

మంగళవారం హుండీ ద్వారా రూ. 4.84 కోట్ల ఆదాయం

ఎన్నికల కోడ్ కారణంగా సిఫార్సు లేఖలపై దర్శనాల రద్దు

ఘాట్ రోడ్లలో ప్రయాణించేవారు అప్రమత్తంగా ఉండాలని సూచన



తిరుమలలో శ్రీవారి దర్శనం కోసం భక్తుల రద్దీ కొనసాగుతోంది. బుధవారం ఉదయం అందిన సమాచారం మేరకు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 10 కంపార్ట్‌మెంట్లు భక్తులతో నిండిపోయాయి. టోకెన్లు లేని భక్తులకు స్వామివారి సర్వదర్శనం లభించేందుకు సుమారు 8 గంటల సమయం పడుతుందని టీటీడీ అధికారులు అంచనా వేస్తున్నారు.మంగళవారం ఒక్కరోజే 79,774 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, వారిలో 21,886 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.84 కోట్లు వచ్చినట్లు టీటీడీ వెల్లడించింది. అలాగే, నిన్న ఒక్కరోజే 4.01 లక్షల లడ్డూ ప్రసాదాలు విక్రయించగా, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కాంప్లెక్స్‌తో కలిపి మొత్తం 2.04 లక్షల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.మరోవైపు, 2027 జనవరి నెలకు సంబంధించిన రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనం, శ్రీవారి సేవ మరియు ఇతర ఆర్జిత సేవల టికెట్ల ఆన్‌లైన్ కోటాను టీటీడీ ఇప్పటికే విడుదల చేసింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున, సిఫార్సు లేఖలపై కేటాయించే దర్శనాలను నిలిపివేసినట్లు అధికారులు స్పష్టం చేశారు. కేవలం స్వయంగా వచ్చే ప్రోటోకాల్ వీఐపీలకు మాత్రమే దర్శన సదుపాయం కల్పిస్తున్నారు. తిరుపతిలోని శ్రీనివాసం, విష్ణు నివాసం, భూదేవి కాంప్లెక్స్‌లలో ఆఫ్‌లైన్ టోకెన్ల జారీ ప్రక్రియ యథావిధిగా కొనసాగుతోంది.వర్షాల ప్రభావం నేపథ్యంలో ఘాట్ రోడ్లలో ప్రయాణించే వాహనదారులు, కాలినడక మార్గాల్లో వచ్చే భక్తులు అప్రమత్తంగా ఉండాలని టీటీడీ యంత్రాంగం సూచించింది.

ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు గుడ్‌న్యూస్

రూ.185 కోట్లు చెల్లింపు

రాష్ట్రంలోని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది

రూ.185 కోట్ల చెల్లింపులు చేసినట్లు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో వెల్లడించారు.



ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ ద్వారా ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటల్స్‌కు రూ.185 కోట్ల చెల్లింపులు చేసినట్లు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ సీఈవో వెల్లడించారు. ఇందులో ఈహెచ్ఎస్ అనుబంధ ఆసుపత్రులకు రూ.50 కోట్లు, వైద్యసేవ ఆసుపత్రులకు రూ.122.64 కోట్లు, ప్రాధాన్య ఆసుపత్రులకు రూ.12.54 కోట్లు చెల్లించినట్లు చెప్పారు. బిల్లు డిస్కౌంట్ పథకం కింద పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు రూ.144 కోట్లు అదనంగా చెల్లించామని తెలిపారు. ఈ నెలలో ప్రైవేట్ నెట్‌వర్క్ హాస్పిటల్‌కు రూ.329 కోట్ల మేర చెల్లింపులు జరిగాయని సీఈవో పేర్కొన్నారు.

'అర్నబ్' ఎఫెక్ట్ - రాబోయే 2 రోజుల పాటు తెలంగాణలో వర్షాలు

అర్నబ్ తుపాను ప్రభావంతో తెలంగాణలో రానున్న రెండు రోజుల పాటు తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు కురువనున్నట్లు వాతావరణ శాఖ ప్రకటించింది

తుపాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గినట్లు తెలిపింది



అర్నబ్ తుపాను ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. ఈ క్రమంలోనే రాబోయే రెండు రోజుల పాటు తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ సూచించింది. తుపాను ప్రభావంతో బుధవారం కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిశాయి.మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా పగటిపూట ఉష్ణోగ్రతలు తగ్గాయని వాతావరణ శాఖ తెలిపింది. కొన్ని జిల్లాల్లో 5.8 డిగ్రీల నుంచి 1.5 డిగ్రీలకు తగ్గాయని, అన్ని జిల్లాల్లోనూ సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని స్పష్టం చేసింది.

భర్త నిర్వాకం..స్నేహితులతో గడపాలంటూ భార్యపై ఒత్తిడి



వివాహితపై సామూహిక అత్యాచారానికి పాల్పడిన ముగ్గురు నిందితులను కంచన్‌బాగ్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం... బాలాపూర్ రోషన్‌దౌలా ప్రాంతానికి చెందిన మహ్మద్ ఫయాజ్ (30) మయన్మార్‌కు చెందిన ఓ యువతిని (19)ని ఈ ఏడాది మే నెలలో వివాహం చేసుకున్నాడు. మద్యానికి బానిసైన మహ్మద్ ఫయాజ్ తన స్నేహితులను ఇంటికి తీసుకొచ్చి వారిని సైతం సుఖపెట్టాలని భార్యపై ఒత్తిడి చేసేవాడు.ఈ క్రమంలో ఆమెను ఫయాజ్ స్నేహితులైన నూర్ కమల్(30), ముజీబ్(29), జియా ఉర్ రెహమాన్ ఆలియాస్ ఇబ్రహీం(30)లు ఆమెను ఇంట్లోనే నిర్బంధించి సామూహికంగా అత్యాచారానికి పాల్ప డ్డారు. ఈ క్రమంలో ఇంటి యజమాని కరెంటు బిల్లు, అద్దె నిమిత్తం ఇంటికి రాగా ఈ దారుణం బయటపడింది. ఈ మేరకు బాధితురాలు కంచన్‌బాగ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు ఆమెను భరోసా కేంద్రానికి పంపించి ముగ్గురు నిందితులను మంగళవారం అరెస్ట్ చేశారు. ఫయాజ్ పరారీలో ఉన్నాడు.

మోడల్ స్కూళ్లలో 776 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బంది

తెలంగాణలోని 194 మోడల్ స్కూళ్లలో నాలుగు కేటగిరీలకు చెందిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీచేసింది. ఒక్కో పాఠశాలలో ఒక ఆర్ట్ టీచర్, ఒక యోగా టీచర్, ఒక కంప్యూటర్ టీచర్, ఒక లైబ్రేరియన్‌ను నియమించనున్నారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ అక్టోబర్ 20న జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. మేడ్చల్--మల్కాజిగిరి, జోగులాంబ గద్వాల, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు, హైదరాబాద్ మినహా మిగిలిన జిల్లాల కలెక్టర్లు నియామక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ అనుమతి ప్రకారం ఈ నియామకాలు నవంబర్ 1, 2026 నుంచి మార్చి 31, 2027 వరకు లేదా అవసరం ముగిసే వరకు.. ఈ రెండింటిలో ఏది ముందైతే అప్పటివరకు కొనసాగుతాయి.అర్హులైన అభ్యర్థులను ఇప్పటికే ఉన్న ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా లేదా కొత్త ఏజెన్సీల ద్వారా నియమించుకోవాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆర్ట్ టీచర్, యోగా టీచర్, కంప్యూటర్ టీచర్‌కు నెలకు రూ.22,750 చొప్పున, లైబ్రేరియన్‌కు

చామలూరు,గూగూడు గ్రామాల్లో టీడీపీ ప్రచార జోరు..!

ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్న ఎంపీటీసీ అభ్యర్థులు..సైకిల్ గుర్తుకు ఓటేయాలని విజ్ఞప్తి





నార్పల (తెలుగు కలం) అక్టోబర్ 29 : నార్పల మండలంలోని చామలూరు,గూగూడు పంచాయతీల్లో టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. చామలూరు లో ఎంపీటీసీ అభ్యర్థి ఆలం శిరీష,ఆలం వెంకటనరసా నాయుడు తో కలిసి ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తూ సైకిల్ గుర్తుకు ఓటు వేసి తమను గెలిపించాలని కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాల ను వివరిస్తూ ప్రజల మద్దతు కూడగట్టే ప్రయత్నం చేస్తున్నారు.అదేవిధంగా గూగూడు ఎంపీటీసీ అభ్యర్థి పత్తిపాటి నాగలక్ష్మి గ్రామంలో విస్తృతంగా పర్యటిస్తూ ఓటర్లను కలుస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి,మౌలిక సదుపాయాల కల్పన,సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలను వివరిస్తూ తనకు అవకాశం కల్పించాలని అభ్యర్థిస్తున్నారు.స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని,ప్రజలకు అందు బాటులో ఉంటూ సేవలందిస్తానని హామీ ఇస్తున్నారు.టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభ్యర్థులతో కలిసి ప్రచారంలో పాల్గొంటూ పార్టీ విజయానికి కృషి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బాత్‌రూమ్‌లో కూర్చొని రీల్స్ స్క్రోల్ చేస్తున్నారా?.. వెంటనే ఆపలేదో.. మీ బాడీ షెడ్డుకే!



సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక పిల్లల నుంచి పెద్దల వరకు ప్రతి ఒక్కరూ ఫోన్‌లకే అతుక్కుపోతున్నారు. ఉదయం లేచినప్పటి నుంచి రాత్రి పడుకునేదాకా.. సోషల్ మీడియా ప్రపంచంలోనే బ్రతికేస్తున్నారు. కొంతమందైతే బాత్‌రూమ్‌లోనూ ఫోన్ చూస్తూ గంటల తరబడి కూర్చుంటున్నారు. కానీ ఇలా ఎక్కువ సమయం బాత్రూమ్‌లో రీల్స్ చూస్తూ ఉడడం వల్ల అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు. అవెంటో ఇక్కడ తెలుసుకుందాం. టెక్నాలజీ రోజురోజుకూ పెరుగుతోంది. మన జీవనశైలి కూడా అంతే. స్మార్ట్‌ఫోన్‌లు జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారాయి. కొంతమందైతే బాత్‌రూమ్‌లోనూ ఫోన్ చూస్తూ గంటల తరబడి కూర్చుంటున్నారు. ఈ అలవాటు చాలా మందికి రోజువారీ దినచర్యగా మారింది. ఇప్పుడు ఈ అలవాటు పెద్ద ప్రభావం చూపకపోయినా.. కాలక్రమేణా, తీవ్రమైన ఆరోగ్య పరిణామాలను కలిగిస్తుంది. ఇది మీ ప్రేగుల ఆరోగ్యాన్ని నాశనం చేయడమే కాకుండా హేమోరాయిడ్ల ప్రమాదాన్ని పెంచుతుంది. టాయిలెట్‌లో మీరు ఫోన్‌ను ఉపయోగించడం వల్ల ఇంకా ఎలాంటి సమస్యలు వస్తాయో చూద్దాం. ఎయిమ్స్, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్‌లలో శిక్షణ పొందిన గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సౌరభ్ సేథి ప్రకారం.. టాయిలెట్‌లో కూర్చుని స్మార్ట్‌ఫోన్‌లను ఉపయోగించే వారికి హెమోరాయిడ్స్ వచ్చే అవకాశం 46% ఎక్కువగా ఉన్నట్టు ఆయన తెలిపారు. ఇందుకు ప్రదాన కారణం ఎక్కువసేపు ఒకే స్థితిలో కూర్చోవడమే అంటున్నారు నిపుణులు. అధిక పీడనం వల్ల మలద్వారం, పురీషనాళంలోని సిరల్లో వాపు వస్తుందని.. ఇది మూలవ్యాధికి వచ్చే అవకాశాన్ని పెంచుతుందని ఆయన తెలిపారు. ఆహారం, వయస్సు, బరువు, శారీరక శ్రమ వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత కూడా, టాయిలెట్‌లో కూర్చుని ఫోన్ ఉపయోగించడం వల్ల మూలవ్యాధి ప్రమాదంపై బలమైన ప్రభావం చూపుతుందని పరిశోధకులు చెబుతున్నారు స్మార్ట్‌ఫోన్ వినియోగదారులలో దాదాపు 37 శాతం మంది ఐదు నిమిషాల కంటే ఎక్కువ సమయం టాయిలెట్‌లో గడుపుతున్నారని అధ్యయనాలు చెబుతున్నాయి. ఐదు నిమిషాలు అంతగా అనిపించకపోవచ్చు, కానీ ఎక్కువసేపు కూర్చోవడం వల్ల అనేక మన శరీరంలోని అనే భాగాలపై నిరంతరం ఒత్తిడి పడుతుంది. ఇది కాలక్రమేనా అలవాటుగా మారినప్పుడు, అది క్రమంగా పురీషనాళంలోని సిరలను బలహీనపరుస్తుంది. మలవిసర్జన సమయంలో ఒత్తిడికి గురికావడం అనేది మూలవ్యాధికి ఒక సాధారణ కారణమని మనని ఆయన చెబుతున్నారు. అలాగే, ఎక్కువసేపు టాయిలెట్‌లో కూర్చోవడం వల్ల రక్త ప్రసరణ దెబ్బతింటుంది, ముఖ్యంగా కాళ్లలో. డీప్ వెయిన్ థ్రాంబోసిస్ లేదా ఇప్పటికే ఉన్న ప్రసరణ సమస్యలు మరింత తీవ్రమవడానికి ఇది ఒక ప్రధాన అంశం. కాబట్టి మీరు బాత్రూంలో ఎక్కువ సమయం గడుపుతున్నట్టు అయితే వెంటనే ఈ అలావాటును మానుకోండి.

వాషింగ్ మెషిన్ నుంచి దుర్వాసన వస్తుందా? ఖర్చు లేని చిట్కా..



వాషింగ్ మెషిన్ అనేది ఇప్పుడు మన దైనందిన జీవితంలో ఒక భాగం. అయితే, కొన్నిసార్లు అందులో నుంచి వచ్చే దుర్వాసన మన దుస్తులకూ అంటుకుని ఇబ్బంది పెడుతుంది. దీనిని వదిలించుకోవడానికి చాలామంది రసాయన ఆధారిత క్లీనర్లను ఉపయోగిస్తారు. కానీ, మన ఇంట్లో దొరికే కేవలం రెండు సాధారణ వస్తువులతో ఈ సమస్యను సులభంగా పరిష్కరించుకోవచ్చు. అవేంటో చూద్దాం.. నేడు చాలా ఇళ్లలో వాషింగ్ మెషిన్ ఒక ముఖ్యమైన వస్తువుగా మారిపోయింది. ప్రతి వారం 3-4 సార్లు దీనిని ఉపయోగిస్తాం. తరచుగా శుభ్రం చేయకపోతే లేదా వాడే నీరు శుభ్రంగా లేకపోతే దీనిలో దుర్వాసన వస్తుంది. ఆ వాసన దుస్తులకు కూడా అంటుకుంటుంది. ఈ పరిస్థితిని నివారించడానికి వాషింగ్ మెషిన్‌ను శుభ్రం చేయడం అవసరం. దీనికి ఎక్కువ ఖర్చు పెట్టాల్సిన పని లేదు. కొన్ని సులభమైన చిట్కాలతో ఈ సమస్యను పరిష్కరించవచ్చు.

కావాల్సిన వస్తువులు: పటిక 1 ముక్క, నిమ్మకాయ తొక్కలు 4, నీరు 2 లీటర్లు.

తయారీ విధానం:

ముందుగా, 2 లీటర్ల నీటిని బాగా మరిగించాలి. నీరు మరిగిన తర్వాత, పటికను పొడి చేసి అందులో కలపాలి. నిమ్మకాయ తొక్కలు కూడా అందులో వేయాలి. ఈ మిశ్రమాన్ని 15 నిమిషాల పాటు మరిగించాలి. నీరు సువాసన వస్తున్నప్పుడు స్టవ్ ఆపివేసి, 15 నిమిషాలు మూతపెట్టి అలాగే ఉంచాలి. ఆ తర్వాత, ఆ ద్రావణాన్ని డిటర్జెంట్ పోసే చోట, మిగిలిన దానిని వాషింగ్ మెషిన్ డ్రమ్ లోపల పోయాలి. డ్రమ్‌లో ఎలాంటి దుస్తులు ఉండకూడదు. మెషిన్‌ను 15-20 నిమిషాల పాటు నడిపించాలి. ఆ నీరు డ్రమ్‌లో ఉన్న మురికిని శుభ్రం చేస్తుంది. ఆ నీరు పూర్తిగా బయటకు వెళ్ళిన తర్వాత, మళ్ళీ 15 నిమిషాలు మంచి నీటితో మెషిన్‌ను నడిపించాలి. పూర్తయిన తర్వాత, మెషిన్‌ను ఆపివేసి, డోర్ తెరిచి గాలి తగిలేలా ఉంచాలి. డ్రమ్ ఆరిపోయిన తర్వాత, దుర్వాసన పూర్తిగా పోతుంది.

ఈ టిప్స్ పాటించండి..

వాషింగ్ మెషిన్ ఎక్కువ కాలం తాజాగా, శుభ్రంగా ఉండాలంటే కొన్ని చిట్కాలు పాటించాలి. ప్రతి వాష్ తర్వాత మెషిన్ డోర్‌ను కాసేపు తెరిచి ఉంచాలి. దీనివల్ల లోపల తేమ ఆరిపోయి, దుర్వాసన రాకుండా ఉంటుంది.

ఎంతసేపు ఉడికించాలి..?



గుడ్డు సంపూర్ణ పోషకాహారంగా వైద్యులు చెబుతారు. గుడ్డులో ప్రొటీన్, అత్యవసరమైన 9 అమైనో ఆమ్లాలు, బి కాంప్లెక్స్ విటమిన్లు, డి విటమిన్ తో పాటుగా ఇతర పోషకాలు పుష్కలంగా ఉంటాయి. అందువల్లనే వైద్యులు కూడా రోజుకో గుడ్డు తినడం ఆరోగ్యానికి మంచిదని చెబుతుంటారు. ఈ కారణంతోనే చాలా మంది బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్ లో ఉడికించిన గుడ్డును మరికొందరు ఆమ్లెట్ రూపంలో తీసుకోవడానికి ఇష్టపడుతుంటారు. మరి గుడ్లను ఎంతసేపు ఉడికించాలి..? మీకు తెలుసా..? శరీరానికి అవసరమయ్యే ప్రొటీన్లు గుడ్డులో చాలా ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. అందుకే గుడ్డును సంపూర్ణ పోషకాహారమని నిపుణులు అంటారు. కనీసం రోజుకు ఒక్క కోడి గుడ్డు అయినా తినాలని సూచిస్తుంటారు. డైలీ ఉడకబెట్టిన గుడ్డును తినడం వల్ల ఎన్నో రకాల ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. అయితే గుడ్లను ఎంతసేపు ఉడికించాలని చాలామందికి సందేహం ఉంటుంది. అయితే గుడ్డును 4 నుంచి 6 నిమిషాలు ఉడికిస్తే పై పొర లైట్ గా గట్టిపడుతుంది. లోపలి పచ్చసొన మాత్రం జిగురులా ఉంటుంది. జపాన్ లో ఇలా తింటారు. %ూశ్రీంశీ =ఝుఎ% "భుజం నొప్పి.. ఫ్రోజెన్ షోల్డర్ కు ఉపశమనం కోసం ఇలా చెయ్యండి! " ఇక గుడ్డును 7 నుంచి 9 నిమిషాల పాటు ఉడికిస్తే మీడియమ్ బాయిలింగ్ అంటారు. తెల్లసొన ఉడుకుతుంది. పచ్చసొన కొద్దిగా ఉడికి క్రీమీగా మారుతుంది. దీంట్లో ప్రొటీన్ అధికంగా ఉంటుంది. సలాడ్స్ లో అధికంగా వాడతారు. ఇక గుడ్డును 10-12 నిమిషాలు ఉడికిస్తే దాన్ని హార్డ్ బాయిలింగ్ అంటారు. దీంట్లో తెల్లసొన, పచ్చసొన పూర్తిగా ఉడుకుతాయి. అలాగే 12 నిమిషాల కంటే అధికంగా ఉడికిస్తే ప్రమాదమని వైద్యులు చెబుతున్నారు. పచ్చ సొనలో ఐరన్, సల్ఫర్ రియాక్షన్ మొదలై.. కడుపుబ్బరం, అజీర్తి సమస్యలు వస్తాయని చెబుతున్నారు

చికెన్ లేదా మటన్ త్వరగా ఉడికి, మెత్తగా టేస్టీగా ఉండాలంటే.. ఈ చిట్కాలను పాటించండి..!



నాన్ వెజ్ ప్రియులు చికెన్, మటన్ లకు చెందిన అనేక వంటకాలను ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఇంట్లో లేదా బయట ఎక్కడైనా సరే నాన్ వెజ్ వంటకాలు కనిపిస్తే నోట్లో నీళ్లూరుతుంటాయి. వీటితోపాటు చేపలు, రొయ్యల వంటి ఆహారాలను ఇష్టంగా తినే వారు కూడా ఉంటారు. అయితే బయట రెస్టారెంట్లలో తిన్నప్పుడు చికెన్, మటన్ వంటివి ఎంతో మెత్తగా ఉంటాయి. కానీ ఇంట్లో మాత్రం వీటిని వండితే అంత మెత్తగా ఉండవు. నాన్ వెజ్‌కు చెందిన ముక్కలు ఎంత మెత్తగా ఉంటే అంత టేస్టీగా ఉంటాయి. చేపలు, రొయ్యలు వంటి వాటిని ఎక్కువగా ఉడికించాల్సిన పనిలేదు. కానీ చికెన్, మటన్‌లను మాత్రం ఎక్కువ సేపు ఉడికించాల్సి ఉంటుంది. అయినప్పటికీ అవి కొన్ని సందర్భాల్లో త్వరగా ఉడకవు. అయితే ఇలాంటి సమయంలో ఏం చేయాలి.. నాన్ వెజ్ వంటకాలు త్వరగా ఉడికేందుకు పాటించాల్సిన చిట్కాలు ఏమిటి.. అన్న వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.చాలా మంది చికెన్ లేదా మటన్‌ను తమకు నచ్చిన స్టైల్‌లో వండుతారు. ఎలా వండినా, ఎంత రుచిగా ఉన్నా ముక్కలు మెత్తగా ఉంటేనే తినాలనిపిస్తుంది. ఇందుకు గాను కొన్ని చిట్కాలను పాటించాల్సి ఉంటుంది. చికెన్, మటన్ త్వరగా ఉడకాలంటే వాటిని కట్ చేసిన విధానంపై కూడా ఆధారపడి ఉంటుంది. కొందరు దుకాణదారులు కట్ చేసిన చికెన్ లేదా మటన్‌ను వండితే సుతిమెత్తగా ఉడుకుతాయి. కానీ కొన్ని అలా ఉండవు. కనుక చికెన్ లేదా మటన్‌ను కట్ చేసే విధానంపై కూడా వాటి మెత్తదనం, టేస్ట్ ఆధార పడి ఉంటాయి. మీకు చికెన్ లేదా మటన్‌ను ఇచ్చే దుకాణదారులు ఎలా కట్ చేస్తున్నారో చూడండి. దీంతో మీకు ఆ ముక్కలు ఎలా ఉడుకుతాయి అన్న అంశంపై అవగాహన వస్తుంది. అలాగే నాన్ వెజ్ వంటకాలను మారినేట్ చేయడం వల్ల వాటి మాంసం చాలా మృదువుగా మారుతుంది. అలాంటి మాంసం చాలా సులభంగా, త్వరగా ఉడుకుతుంది. పైగా టేస్టీగా కూడా ఉంటుంది. మారినేషన్‌కు వాడే పదార్థాల వల్ల మాంసం మెత్తగా మారి త్వరగా ఉడుకుతుంది. చికెన్ ను కనీసం 1 గంట పాటు, మటన్‌ను కనీసం 2 గంటల పాటు మారినేట్ చేసేలా చూడండి. దీంతో మెత్తని మాంసాన్ని ఆస్వాదించవచ్చు.నాన్ వెజ్‌ను మారినేట్ చేసేందుకు గాను పెరుగు, మజ్జిగ, వెనిగర్, నిమ్మరసం వంటివి వాడవచ్చు. వీటిల్లో ఉండే యాసిడ్లు మాంసాన్ని మెత్తగా మారుస్తాయి. దీంతో మాంసం మెత్తగా ఉడుకుతుంది. మాంసం ఉడికేటప్పుడు అందులో పచ్చి బొప్పాయి, కివి, పైనాపిల్ వంటి వాటిని ముక్కలుగా కట్ చేసి వేయాలి. దీని వల్ల మాంసంలో ఉండే ప్రోటీన్లు సులభంగా విచ్ఛిన్నం అవుతాయి. అప్పుడు మాంసం త్వరగా ఉడుకుతుంది. అయితే వీటిని వేసిన తరువాత మాంసం ఉడకగానే వెంటనే ఆ ముక్కలను తీసేయాలి. లేదంటే మాంసం రుచి మారిపోతుంది. ఇక కొందరు వేపుడు వంటివి చేసేటప్పుడు మూతపెట్టకుండా నేరుగా వంట చేస్తారు. అలా చేయకూడదు. ముందుగా ముక్కలు బాగా ఉడికిన తరువాత వాటిని వేయించాల్సి ఉంటుంది. దీంతో ముక్కలు మెత్తగా ఉంటాయి. టేస్టీగా మారుతాయి.సన్నని మంటపై పాత్రను ఉంచి దానిపై మూత పెట్టి మాంసాన్ని ఉడికించడం వల్ల కూడా మాంసం సుతిమెత్తగా మారుతుంది. మూత పెట్టి ఉడికించడం వల్ల ఆవిరి బయటకు పోదు. దీని వల్ల మాంసం త్వరగా ఉడుకుతుంది. టేస్టీగా కూడా ఉంటుంది. మీకు ఓవెన్ ఉంటే మాంసం చిదురు కాకుండా తగినంత ఉష్ణోగ్రతకు ఓవెన్ ను సెట్ చేసి మాంసాన్ని ఉడికించవచ్చు. దీని వల్ల కూడా మాంసం మెత్తగా మారుతుంది. అయితే సాధారణంగా చికెన్ త్వరగానే ఉడుకుతుంది. కానీ మటన్‌ను ఉడికించాలంటే చాలా బాగా కష్టపడాల్సి ఉంటుంది. అందువల్ల మటన్‌ను కొనేటప్పుడే లేత మటన్ ను ఎంచుకుంటే మంచిది. దీని వల్ల మటన్ త్వరగా ఉడకడమే కాకుండా రుచిగా కూడా ఉంటుంది. సులభంగా మారినేట్ అవుతుంది. హోటల్స్‌లో భారీ ఎత్తున పాత్రలను పెట్టి పెద్ద మంటతో ఉడికిస్తారు కనుక సహజంగానే మాంసం త్వరగా ఉడుకుతుంది. కానీ ఇళ్లలో వండితే మాత్రం మాంసం త్వరగా ఉడకాలన్నా, మెత్తగా మారాలన్నా ఆయా చిట్కాలను పాటించాల్సి ఉంటుంది.

జీవితానికి వన్నెలద్దుదాం



జీవితం రంగురంగుల హరివిల్లులా ఉండాలని అందరూ కోరుకుంటారు. అయితే ఆ రంగులు మన మనసుపైనే కాదు జీవితం మీద కూడా ప్రభావం చూపిస్తాయంటే నమ్ముతారా? అవును, వివిధ వర్ణాలు మన వ్యక్తిత్వం, ఆలోచనా విధానం, ఆనందాన్ని మారుస్తాయి. దీనికి సంబంధించి ఎన్నో శాస్త్రీయ పరిశోధనలు, అధ్యయనాలు జరిగాయి. అవన్నీ కూడా రంగులు మన జీవితాన్ని ప్రభావితం చేస్తాయని తేల్చాయి. క్రోమో థెరపీ (కలర్ థెరపీ)తో మనిషిలో మార్పులు వస్తాయని నిపుణులు చెప్తున్నారు.

కలర్ ఎఫెక్ట్..

లివింగ్ స్పేస్: ఇల్లు, ఆఫీసు, పబ్లిక్ ప్రదేశాల్లో ఎక్కడైనా మనం ప్రశాంతతనే కోరుకుంటాం. అందువల్ల ఆయా ప్రదేశాల్లో నీలి రంగు, ఆకుపచ్చ రంగులు ఉంటే మనసుకు హాయిగా, ఉత్సాహంగా ఉంటుందట. భోజనం చేసే చోట మాత్రం ముచ్చట్లు పెడుతుంటాం! అక్కడ ఎరుపు, నారింజ రంగులు ఉండాలని నిపుణుల మాట. వెల్ బియింగ్: కొన్నిరకాల రంగులు మనలోని సృజనాత్మకతను వెలికితీస్తాయి. అందులో ప్రధానంగా చెప్పుకోవాల్సింది పసుపు రంగు. అలాగే సోషలైజేషన్‌ను ప్రోత్సహించే క్రమంలో నారింజ రంగు ఉపయోగపడుతుందట. చదువుకునే చోట, వ్యాపార లావాదేవీలు నిర్వహించే గదిలో నీలి, ఆకుపచ్చ రంగులు పాజిటివ్ వైబ్రేషన్స్‌ను కలిగిస్తాయని పరిశోధనల్లో తేలింది. దుస్తుల్లోనూ దోస్తీ: మనసుకు నచ్చిన రంగు దుస్తులనే చాలావరకు ఎంపిక చేసుకుంటాం. అలాకాకుండా రంగుల ప్రాముఖ్యాన్ని తెలుసుకుని వేసుకుంటే, కచ్చితంగా వ్యక్తిత్వంలో మార్పు వస్తుందని నిపుణులు చెప్తున్నారు. అంతేకాదు ముదురు రంగులు కాకుండా.. కూల్ కలర్స్ ఎంపిక చేసుకుంటే మంచిదని సూచిస్తున్నారు.

వ్యక్తిత్వంపై ప్రభావం

ఎరుపు, నారింజ, పసుపు: ఈ కలర్స్ ఉత్సాహాన్ని కలిగిస్తాయి. మనలో ప్రేరణశక్తిని పెంచుతాయి. కానీ కొన్ని సందర్భాల్లో ఒత్తిడి, ఆకస్మిక ఆందోళనకు కూడా దారి తీస్తాయట. నీలి, ఆకుపచ్చ: ఈ రంగులు భావోద్వేగాలను స్థిరీకరిస్తాయి. ఏకాగ్ర చిత్తాన్ని కలిగిస్తాయి. మనసును ప్రశాంతపరుస్తాయి. చాలాసార్లు ఈ రంగులు అంగీకారాన్ని తెలియజేస్తాయట. నలుపు, బూడిద, గోధుమ: ఈ వన్నెలను గంభీరతకు చిహ్నంగా చెబుతారు. ఈ తరహా రంగు దుస్తులు ఎక్కువగా ధరించేవాళ్లు అంతర్ముఖంగా ఉంటారని నిపుణుల మాట. అయితే, బూడిద, గోధుమ రంగులు వేసుకున్నప్పుడు ఎదుటివ్యక్తుల నుంచి అనుకూల ప్రతిస్పందనలు వస్తాయట. ఊదా: ఈ వర్ణం ఊహ, ఆధ్యాత్మికతకు సంబంధించినదిగా చెప్తారు. కానీ ఈ రంగును ఎక్కువగా ఉపయోగించే ఆ వ్యక్తులు మానసికంగా అసౌకర్యంగా ఉన్నట్లుగా కొన్ని అధ్యయనాలు తేల్చాయి.

క్రోమోథెరపీ..

ఈ కలర్ థెరపీలో కొన్నిరకాల రంగులు ఉపయోగించి మానసిక ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమిని తగ్గిస్తారు. దానికోసం లైట్, డెకర్, క్లాథింగ్‌లో నీలిరంగు, ఆకుపచ్చ రంగులను ఉపయోగిస్తారు. నీలిరంగు వేరేచోట్ల ప్రయోజనాలు అందించినా, స్మార్ట్ ఫోన్ల విషయంలో కీడు చేస్తుంది. స్క్రీన్ నుంచి వచ్చే బ్లూ లైట్‌ను తగ్గించుకుంటే నిద్రలేమి సమస్య తగ్గుతుంది. దీన్ని అధిగమించడానికి స్క్రీన్ టైమ్ తగ్గించడంతోపాటు బ్లూలైట్ ఫిల్టర్లు వాడటం మంచిది. ఆకుపచ్చ, నీలిరంగులు ఆందోళనను తగ్గిస్తాయి. వాకింగ్, ఫారెస్ట్ ట్రెక్కింగ్, నేచర్ బాత్ థెరపీలోనూ ఈ రంగులను ఉపయోగిస్తుంటారు.

సరదాల పేరుతో "సర్వరోగ కారిణి"

జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు!

మద్యం ఎంత తీసుకున్నా ఆరోగ్యానికి ప్రమాదమేనా

పరిశోధనలు ఏం చెప్తున్నాయంటే!



బర్త్ డే వస్తే పార్టీ. జాబ్ వస్తే పార్టీ. పెళ్లి కుదిరితే పార్టీ. ప్రమోషన్ వస్తే పార్టీ. ఫ్రెండ్స్ వస్తే పార్టీ. వారు విదేశాలకు వెళ్తే పార్టీ. ఇలా ఏదో ఒక కారణంతో మద్యం సేవించడం కామన్ అయ్యింది. ఇది మత్తు కలిగించటంతోనే ఆగదు. మెదడు దగ్గరి నుంచి పేగుల వరకూ శరీరమంతా ప్రతికూల ప్రభావం చూపుతుందంటున్నారు నిపుణులు. మద్యం దీర్ఘకాలంలో తీవ్ర అనర్థాలే తెచ్చిపెడుతుందని చెబుతున్నారు. ఈ క్రమంలో మద్యం వల్ల శరీరానికి ఎలాంటి హాని కలుగుతుందో ఇప్పుడు తెలుసుకుందాం!

మెదడుపై సత్వం ప్రభావం : మద్యం ప్రభావం మెదడు మీద చాలా వేగంగా పడుతుందంటున్నారు నిపుణులు. మొదట్లో ఒత్తిడి నుంచి ఉపశమనంగా, నలుగురితో కలివిడిగా ఉన్న భావన కలుగుతుందట. కానీ, రోజులు గడుస్తున్నా కొద్ది మద్యం మూలంగా మెదడు ఆకృతిలో మార్పులు వస్తుంటాయి. సగటున రోజుకు ఒక డ్రింకు తాగినా మధ్యవయసు వారిలో, వృద్ధుల్లో మెదడు పరిమాణం తక్కువగా ఉంటున్నట్టు పలు అధ్యయనాల్లో వెల్లడైంది. ఎంత ఎక్కువగా మద్యం తాగితే అంత ఎక్కువగా మెదడు కుంచించుకుపోవడం గమనార్హం. దీనికి కారణం ఏంటన్నది కచ్చితంగా తెలియదట. కానీ, మెదడుకు సంబంధించిన రోగనిరోధక వ్యవస్థను మద్యం మార్చేస్తుండొచ్చన్నది ఒక సిద్ధాంతం. ఇది ఇన్‌ఫ్లమేషన్‌ను ఉత్తేజితం చేసి, నాడీ కణాలను దెబ్బతీస్తుండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు.

నోటిపై నేరుగా : మద్యం తాగినప్పుడు నోరు, గొంతులోని కణజాలాలు నేరుగా ప్రభావితమవుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో స్వల్ప మోతాదులో మద్యం తీసుకున్నా కూడా నోటి క్యాన్సర్ వచ్చే ప్రమాదం 50 శాతం ఎక్కువనీ, నాటుసారా తాగితే ఆ ప్రమాదం 87 శాతానికి పెరుగుతుందని దీవీజీ +శ్రీశీఝశ్రీ ఎఝశ్రీష్ట్ర అధ్యయనం పేర్కొంది.అంతేకాదు, మద్యం జీర్ణమయ్యే క్రమంలో అసిటలహైడ్ అనే విషపదార్థం పుట్టుకొస్తుంది. ఇది ణచీూకు అంటుకొని కణాలను దెబ్బతీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా, నోరు, గొంతు, స్వరపేటిక, అన్నవాహిక క్యాన్సర్ల ముప్పు పెరుగుతుందని జవత్‌వతీం టశీతీ ణఅంఝంవ జశీత్‌తీశీశ్రీ ఝఅఎ ూతీవజవత్‌అశీఅ అధ్యయనం పేర్కొంది. ఈ క్రమంలో రోజుకు ఒక డ్రింకు తాగినా నోరు, గొంతు క్యాన్సర్ల ముప్పు 13 శాతం, అన్నవాహిక క్యాన్సర్ ముప్పు 26 శాతం మేరుకు పెరుగుతుందని ఒక విశ్లేషణలో తేలింది. ఇక రోజుకు ఐదు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగితే ఈ క్యాన్సర్ల ముప్పు సుమారు 4 రెట్లు ఎక్కువవుతుందట.

గుండెకు హాని : ఒకప్పుడు మద్యపానం గుండెకు మేలు చేయొచ్చని పరిశోధకులు అనుకునేవారు. కానీ, ఇటీవల పరిశోధనల ఫలితాలు వెలుగు చూస్తున్న కొద్దీ ఈ అభిప్రాయం మారిపోయింది. మద్యతో గుండెపోటు, స్ట్రోక్ ముప్పులు పొంచి ఉంటున్నాయనే విషయం బలపడుతూ వచ్చింది. ఈ క్రమంలో రోజుకు మూడు లేదా అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగే వారికి గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశం ఉందంటున్నారు నిపుణులు. అతిగా, దీర్ఘకాలంగా మద్యం తాగితే గుండె కండరం దెబ్బతింటుందని చెబుతున్నారు. బీపీ పెరగటంతో పాటు కొలెస్ట్రాల్ కూడా ఎక్కువవుతుందట. పూడికలు ఏర్పడే ముప్పు పెరుగుతుందట. మద్యంతో గుండె లయ అస్తవ్యస్తం అయ్యే ప్రమాదం ఉందట. రోజుకు రెండు డ్రింకులు, అంతకన్నా తక్కువ తాగినా గుండెపోటు, స్ట్రోక్ వచ్చే అవకాశం ఎక్కువగానే ఉంటున్నట్టు పలు అధ్యయనాల్లో తేలింది. ఒక మాదిరిగా మద్యం తాగితే గుండెకు మేలు చేసే అవకాశం ఉందని కొన్ని పరిశోధనలు చెబుతున్నప్పటికీ ఇందులో వాస్తవం లేదని మరికొన్ని అధ్యయనాలు కొట్టిపారేస్తున్నాయి. మద్యం సేవించడం వల్ల కాలేయ వ్యాధులు, గుండె జబ్బులు, వివిధ రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని ఔశీతీశ్రీఎ ఎఝశ్రీష్ట్ర ూతీస్ఝుఅఅఓఘ్‌అశీఅ అధ్యయనం పేర్కొంది. అలాగే, మానసిక ఆరోగ్యం, నిరాశ, ఆందోళన, మద్యపాన రుగ్మతలు వంటి ప్రవర్తనా పరిస్థితులు కూడా వస్తాయని తెలిపింది.

పేగులకు పెను ప్రమాదం : నోరు, గొంతు మాదిరిగానే జీర్ణాశయం, పేగులు కూడా నేరుగా మద్యం ప్రభావానికి గురవుతాయని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల దెబ్బతినే అవకాశమూ ఎక్కువగా ఉంటుందట. ఇది జీర్ణకోశం లోపం గోడ వాపు, అల్సర్లు, వాంతి, వికారం వంటి సమస్యలకు దారితీస్తుంది. పేగుల్లోని సూక్ష్మక్రిములను దెబ్బ తీయటం వల్ల విరేచనాలు, పోషకాలను సరిగా గ్రహించకోలేకపోవటం వంటి సమస్యలు రావొచ్చట. పేగులో నుంచి హాని కారకాలు రక్తంలోకి వెళ్లకుండా చూసే పొర దెబ్బతినొచ్చు. తద్వారా రక్తంలోకి విషతుల్యాలు చేరుకొని, శరీరమంతా వాపు ప్రక్రియ ప్రేరేపితం కావొచ్చని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో రోజుకు రెండు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగే వారికి పెద్దపేగు క్యాన్సర్ వచ్చే అవకాశం 25 శాతం వరకూ ఎక్కువగా ఉంటున్నట్లు ఒక తాజా అధ్యయనంలో తేలింది.

కాలేయం కకావికలం : మద్యం మూలంగా దెబ్బతినే అవయవాల్లో ప్రధానంగా లివర్ ఒకటి. మద్యంతో ముడిపడిన లివర్ వ్యాధులు ఎంతో మందిని కబళిస్తోంది. రక్తంలో కలిసిన మద్యాన్ని వడగట్టేది కాలేయమే అని నిపుణులు చెబుతున్నారు. దీన్ని వడగడుతున్న ప్రతిసారీ కొన్ని కాలేయ కణాలు చనిపోతుంటాయని పేర్కొంటున్నారు. వాస్తవానికి, కాలేయం కొత్త కణాలను సృష్టించుకుంటుందట. కానీ, అదే పనిగా మద్యం ఎక్కువగా తాగుతుంటే క్రమంలో ఈ సామర్థ్యం తగ్గుతూ వస్తుంది. మద్యం అలవాటు గల వారికి కాలేయ కణాల్లో కొవ్వు పోగుపడటం, హెపటైటిస్ (కాలేయం వాపు), సిరోసిస్ (కాలేయం గట్టిపడటం) ముప్పు ఎక్కువగా ఉంటుంది. ఈ క్రమంలో రోజుకు నాలుగు డ్రింకుల కన్నా ఎక్కువ తాగేవారిలో 90 శాతం మందికి కాలేయంలో కొవ్వు పోగుపడుతోందని నిపుణుల అంచనా. అయితే, రోజుకు మూడు, అంతకన్నా ఎక్కువ డ్రింకులు తాగేవారిలో 30 శాతం మంది హెపటైటిస్ బారినపడుతున్నారు. అయితే, ఇప్పుడే జాగ్రత్త పడితే తొలిదశలో ఇలాంటి సమస్యలను వెనక్కి మళ్లించుకోవచ్చట. కాలేయం గట్టిపడటం తీవ్రమైతే మాత్రం కోలుకోవటం కష్టం. అయితే, అతిగా మద్యం తాగితే కాలేయ క్యాన్సర్ల ముప్పూ ఎక్కువవుతుందట.

తెలుగుకలం
TELUGUKALAM TELUGUDAILY తెలుగు దిన పత్రిక
శుక్రవారం 30 - 10 - 2026

బెంగళూరు వాసులకు గుడ్ న్యూస్.. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ప్లాన్

రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో క్యూలైన్లకు చెక్



ఆస్తి నమోదు కార్యాలయాలలో మౌలిక వసతులను మెరుగుపరచడంతో పాటు పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేని మెరుగైన సేవలను అందించేందుకు కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పాస్‌పోర్ట్ సేవా కేంద్రం నమూనాను పూర్తిగా అనుసరిస్తూ.. ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యం చట్రం కింద బెంగళూరులో ఐదు మోడల్ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రాజెక్ట్ సాధ్యాసాధ్యాలను అంచనా వేయడానికి.. తగిన పీపీపీ నిర్మాణాన్ని సిఫార్సు చేయడానికి, ప్రైవేట్ భాగస్వామిని ఎంపిక చేయడంలో సహాయపడటానికి స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ త్వరలో ఒక లావాదేవీ సలహాదారుని నియమించనుంది. ఆధునిక మౌలిక సదుపాయాలు, ఆహ్లాదకరమైన వేచి ఉండే ప్రదేశాలు, రిసెప్షన్ సౌకర్యాలు, పౌర సహాయ కేంద్రాలు, అత్యుత్తమ సేవల పంపిణీపై ప్రధానంగా దృష్టి సారించి ఈ ఐదు కార్యాలయాలను ఒక పైలట్ ప్రాజెక్ట్‌గా అభివృద్ధి చేయనున్నారు. రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్, స్టాంప్స్ కమిషనర్ ముల్లై ముహిలన్ ఎంపీ మనీకంట్రోల్‌తో మాట్లాడుతూ.. గాంధీ నగర్, శివాజీ నగర్, రాజాజీ నగర్, జయనగర్, బసవనగుడిలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో ఒక్కొక్కటి చొప్పున ఐదు మోడల్ ఎస్ఆర్ఓలను ఏర్పాటు చేయాలని మేము భావిస్తున్నామని తెలిపారు. ఈ కార్యాలయాలు ఇప్పటికే ఉన్న ఎస్ఆర్ఓలను ఉన్నతీకరించడం కాకుండా, పూర్తిగా కొత్త సౌకర్యాలుగా ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. పాస్‌పోర్ట్ సేవా కేంద్రాల మాదిరిగానే ప్రవేశ నియంత్రణ మెరుగైన సందర్శకుల సౌకర్యాలతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల రూపురేఖలను పూర్తిగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. కుప్పకూలుతున్న బెంగళూరు రియల్ ఎస్టేట్.. అదను చూసి దెబ్బ కొట్టిన తమిళనాడు.. సౌకర్యాల కల్పన, నిర్వహణ బాధ్యతలను ప్రైవేట్ రంగ భాగస్వామికి అప్పగించనున్నప్పటికీ.. చట్టబద్ధమైన రిజిస్ట్రేషన్ విధులు, నియంత్రణ అధికారాలు మాత్రం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వానికే ఉంటాయి. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లో తరచుగా కనిపించే పొడవైన క్యూలు, జాప్యం, అవినీతి, మధ్యవర్తుల ప్రమేయంపై వస్తున్న ఫిర్యాదులకు చెక్ పెట్టడమే లక్ష్యంగా ఈ చర్య తీసుకున్నారు. కాగా, మహారాష్ట్ర ప్రభుత్వం కూడా ఇదే తరహాలో ఎఖీం గ్లోబల్, ఔజు ఎక్సెల్ సాఫ్ట్‌వేర్‌ల కన్సార్టియంతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా 60 మోడల్ ఎస్ఆర్ఓలను ఏర్పాటు చేయడానికి ఐదేళ్ల కాంట్రాక్టును ఖరారు చేయడం గమనార్హం. నియమించబడే లావాదేవీ సలహాదారు ఆయా ప్రదేశాలలో రిజిస్ట్రేషన్ల సంఖ్య, పౌరుల రాకపోకలు, మౌలిక వసతుల అవసరాలు, డిమాండ్‌ను సమగ్రంగా అంచనా వేస్తారు. అంతేకాకుండా, మూలధన, నిర్వహణ వ్యయం, ప్రధాన ఆదాయ మార్గాలు, ప్రభుత్వం - ప్రైవేట్ భాగస్వామి మధ్య ఆదాయ-భాగస్వామ్య యంత్రాంగాన్ని ఈ సలహాదారు సిఫార్సు చేస్తారు. ఇరు పక్షాల బాధ్యతలు, సేవా ప్రమాణాలు, పనితీరు సూచికలను కూడా వీరు ఖరారు చేస్తారు. అయితే, దీనికి సంబంధించిన ఖచ్చితమైన పెట్టుబడి అవసరాలు, ఆదాయ-భాగస్వామ్య విధానం, ప్రైవేట్ సేవల కోసం అనుమతించదగిన ఛార్జీలను ఇంకా అధికారికంగా నిర్ణయించాల్సి ఉంది.

ఆ ఖాతాలను రద్దు చేయనున్న పంజాబ్ నేషనల్ బ్యాంక్



బ్యాంకు ఖాతాలు వాడకుండా ఉన్న వినియోగదారులకు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఒక ముఖ్యమైన హెచ్చరిక జారీ చేసింది. మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం ఉపయోగించకుండా ఉండి, ఖాతాలో సున్నా నిల్వ (జీరో బ్యాలెన్స్) ఉన్న కొన్ని ఖాతాలను నవంబర్ 10, 2026 తర్వాత మూసివేయవచ్చని ఈ ప్రభుత్వ రంగ బ్యాంకు ప్రకటించింది. బ్యాంకింగ్ సేవలకు అంతరాయం కలగకుండా ఉండేందుకు, వినియోగదారులు గడువులోగా తమ నో యువర్ కస్టమర్ (కేవైసీ) లాంఛనాలను పూర్తి చేసి, తమ ఖాతాలను తిరిగి ఉపయోగించుకోవాలని బ్యాంకు కోరింది. బ్యాంకు తాజా నోటీసు రెండు నిర్దిష్ట షరతులకు అనుగుణంగా ఉన్న ఖాతాలకు వర్తిస్తుంది. మొదటిది సెప్టెంబర్ 30, 2026 నాటికి ఖాతాలో మూడు సంవత్సరాల కంటే ఎక్కువ కాలం పాటు వినియోగదారుడు ప్రారంభించిన ఏ లావాదేవీ లేదా కార్యకలాపం నమోదు కాకూడదు. రెండోది ఖాతాలో సున్నా నిల్వ (జీరో బ్యాలెన్స్) ఉండాలి. అంటే సెప్టెంబర్ 30, 2023 కంటే ముందు నుంచి తమ ఖాతాలను ఉపయోగించని, వాటిలో ఎటువంటి డబ్బు మిగిలి లేని వినియోగదారులు ప్రభావితం కావచ్చు. అయితే నిష్క్రియంగా ఉన్న ప్రతి సావీదీ ఖాతా స్వయంచాలకంగా మూసివేయరు. ఉదాహరణకు కొన్ని సంవత్సరాల క్రితం పొదుపు ఖాతాను తెరిచి, దానిని ఉపయోగించడం మానేసి, సున్నా నిల్వను (జీరో బ్యాలెన్స్) నిర్వహిస్తున్న కస్టమర్, గడువులోగా చర్య తీసుకోవలసి ఉంటుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖాతాదారుల వివరాలు లీక్ అయ్యాయా..! ఇలాంటి ఖాతాల దుర్వినియోగాన్ని నిరోధించడానికి, వాటికి సంబంధించిన భద్రతాపరమైన నష్టాలను తగ్గించడానికి ఈ మూసివేత ప్రక్రియ నిర్ణయం తీసుకున్నట్లు బ్యాంకు తెలిపింది. నిర్దిష్ట వర్గం కిందకు వచ్చే ఖాతాదారులు అవసరమైన లాంఛనాలను పూర్తి చేయడానికి నవంబర్ 10, 2026 వరకు గడువు విధించింది. ఖాతాదారులు తమ సంబంధిత బ్యాంకు శాఖలను సందర్శించి నవీకరించిన ఖ్జ పత్రాలను సమర్పించి, తమ ఖాతాలను తిరిగి సక్రియం చేయమని అభ్యర్థించాలని బ్యాంకు సూచించింది. బ్యాంకు అధికారిక మార్గదర్శకాల ప్రకారం వాడకుండా ఉన్న ఖాతాను తిరిగి వాడుకలోకి తెచ్చుకునే కస్టమర్లు సాధారణంగా చెల్లుబాటు అయ్యే గుర్తింపు, చిరునామా పత్రాలతో పాటు ఒక అభ్యర్థన లేఖను సమర్పించాల్సి ఉంటుంది. ఆధార్, పాన్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడితో పాటు ఇతర అధికారికంగా చెల్లుబాటు అయ్యే పత్రాలు ఉన్నాయి. వినియోగదారులు తమ పాన్ లేదా ఫారం 60ని కూడా అందించాల్సి రావచ్చు. బ్యాంకు పత్రాలను ధృవీకరించి, అవసరమైన తనిఖీలను పూర్తి చేసిన తర్వాత, ఖాతాను తిరిగి క్రియాశీల స్థితికి తీసుకురావచ్చు. వర్తించే ధృవీకరణ అవసరాలకు లోబడి, ప్రధాన శాఖేతర శాఖల ద్వారా కూడా ఖాతాను తిరిగి క్రియాశీలం చేయమని అభ్యర్థించడానికి పీఎన్బీ సాధారణ మార్గదర్శకాలు వీలు కల్పిస్తాయి. ఒక పొదుపు లేదా కరెంట్ ఖాతాలో వరుసగా 24 నెలల పాటు వినియోగదారుడు స్వయంగా ఎటువంటి లావాదేవీలు జరపకపోతే, ఆ ఖాతా నిష్క్రియంగా నిర్ణయిస్తారు. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఉద్యోగులకు గుడ్ న్యూస్.. డీఏ పెంచిన కేంద్ర ప్రభుత్వం..!



దీపావళి పండుగకు ముందు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 3 శాతం కరువు భత్యం పెంపునకు ఆమోదం తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారులకు వర్తించే ఈ కరువు భత్యం కరువు ఉపశమన భత్యం పెంపు, జూలై 1వ తేదీ నుంచి అమలులోకి వస్తుంది. కరవు భత్యాన్ని మరో 3 శాతం పెంచాలని కేంద్రం నిర్ణయించింది. దీంతో ఆ ఉద్యోగుల డీఏ 60 నుంచి 63 శాతానికి డీఏ పెరిగింది. కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగ విరమణ చేసి పింఛన్ పొందుతున్నవారికి ఇస్తున్న కరవు భృతి (డీఆర్) కూడా 3శాతం పెంచనుంది. ఈ పెంపు వల్ల దాదాపు 48 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, 68 లక్షల మంది పింఛనుదారులు ప్రయోజనం పొందుతారు. ఈ ణూ-ణ= పెంపు కోసం ప్రభుత్వం రూ. 10,016 కోట్లను కేటాయించింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో కేంద్ర మంత్రివర్గం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు కరువు భత్యాన్ని పింఛనుదారులకు కరువు ఉపశమన భత్యాన్ని అదనపు విడతగా విడుదల చేయడానికి ఆమోదం తెలిపింది. ఇది అప్పటి వరకు ఉన్న మూల వేతనం/పింఛనులో 58 శాతం రేటుపై అదనంగా 2 శాతం పెంపును సూచించింది. కరువు భత్యం మరియు కరువు ఉపశమన భత్యం రెండింటి పెంపు వల్ల ప్రభుత్వ ఖజానాపై ఏటా రూ. 6,791.24 కోట్ల భారం పడనుంది. ఉద్యోగులకు గుడ్ న్యూస్.. మీ వద్దకే రానున్న పీఎఫ్ అధికారులు..! డీఏ పెంపుతో పాటు కేంద్ర కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.10వేల కోట్లతో దేశీయంగా కంటైనర్ తయారీ ప్రోత్సాహక పథకానికి క్యాబినెట్ ఆమోదించింది. రూ.1856 కోట్లతో ఖేలో ఇండియా స్పోర్ట్స్ గూడ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ పథకం, రూ. 7395 కోట్లతో ప్రధాన మంత్రి వికసిత్ గ్రామ స్వరాజ్ పథకానికి కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. డిస్క్లెమర్: ఈ వెబ్‌సైట్‌లోని అభిప్రాయాలు, సూచనలు పూర్తిగా వ్యక్తిగత విశ్లేషకులు లేదా ఇతర సంస్థలవి మాత్రమే. ఇవి అధికారిక అభిప్రాయాలు కాదని గమనించగలరు.మేము ఈ విషయం యొక్క ఖచ్చితత్వం, సమగ్రత లేదా విశ్వసనీయతపై ఎటువంటి హామీ ఇవ్వడం కాని, అనుమతించడం కాని బాధ్యత వహించడం జరగదు. మేము ఎలాంటి పెట్టుబడి సలహా ఇవ్వము. అలాగే ఎటువంటి సెక్యూరిటీ కొనుగోలు లేదా అమ్మకాలు ప్రోత్సహించము. ఈ వెబ్‌సైట్‌లోని కథనం పూర్తిగా సమాచారం, విద్యా ప్రయోజనాల కోసమే అందించబడుతుంది. మీరు ఏదైనా పెట్టుబడి నిర్ణయం తీసుకునే ముందు, లైసెన్స్ పొందిన ఆర్థిక సలహాదారుల సహాయం తీసుకోండి. ఈ కథనాన్ని కేవలం సమాచారంగా మాత్రమే పరిగణించండి.

ఏఐ బబుల్ పేలింది చైనాలో మొదలైంది, తర్వాత ఏంటి



ప్రపంచమంతా దేని గురించి అయితే భయపడుతోందో, ఇప్పుడు అదే జరగడం మొదలైంది. ఏ పెద్ద సంఘటనకైనా ఒక చిన్న ప్రారంభం ఉంటుందంటారు కదా.. అలాగే, ఏఐ బబుల్ పేలుడుకు సంబంధించిన తొలి సంకేతాలు చైనాలో కనిపించాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రపంచ భవిష్యత్తు అనడంలో ఎలాంటి సందేహం లేదు. కానీ, దీని కోసం చేస్తున్న ఖర్చు, దాని ద్వారా వచ్చే లాభాలు, ప్రయోజనాలు, ప్రభావం వంటివే ఇప్పుడు పెద్ద ప్రశ్నలుగా మారాయి. పెట్టుబడిదారులు, మార్కెట్లు ఎప్పుడూ కలల వెంట పరుగెత్తవు, లాభాల కోసమే చూస్తాయి. ఈ క్రమంలోనే, ఏఐపై పెట్టిన పెట్టుబడులకు తగినంత లాభం రావడం లేదని ఇన్వెస్టర్లు ఆందోళన చెందడం మొదలుపెట్టారు. ఇదే సమయంలో, ఇన్వెస్ట్‌మెంట్ మార్కెట్‌లో, ఏఐ అభివృద్ధిలో భారీ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. చైనా ఈవీ బ్యాటరీలకు సవాల్..ఈ రెండు భారతీయ కంపెనీల స్టాక్స్ మీద ఓ కన్నేసి ఉంచండి.. దీని ఫలితంగా, చైనాలో ఏఐ, సెమీకండక్టర్ రంగాల షేర్లను ట్రాక్ చేసే 50 ఇండెక్స్ ఎవరూ ఊహించని విధంగా 40 శాతం పడిపోయింది. దీంతో ఈ ఇండెక్స్ కింద లిస్ట్ అయిన కంపెనీల మార్కెట్ విలువ ఏకంగా 480 బిలియన్ డాలర్లు ఆవిరైపోయింది. ఇదే తరహాలో, దక్షిణ కొరియాకు చెందిన కాస్పి ఇండెక్స్ దాని 2026 గరిష్ట స్థాయి నుంచి 33 శాతం పతనమైంది. తైవాన్ ూూ×ఱుశ ఇండెక్స్ 2026 నాటి గరిష్టం నుంచి 7.6 శాతం, నాస్‌డాక్ (మ్ఝింఱున) 6 శాతం మేర నష్టపోయాయి. బంగారం కొనుగోలు చేసేందుకు ఎగబడుతున్న చైనా ప్రజలు.. ఈ పరిణామాలన్నీ గత 4 నెలల్లోనే జరిగాయి. ప్రస్తుత పరిస్థితుల్లో చైనా మార్కెట్ వేగంగా పతనమవుతుండగా, ఇతర మార్కెట్లు కాస్త తక్కువ వేగంతో క్షీణిస్తున్నాయి. దీంతో మొత్తం మార్కెట్ పతనం దిశగా పయనిస్తోందని స్పష్టమవుతోంది. ఈ నేపథ్యంలో, ఏఐ బబుల్ చైనా నుంచే పేలడం మొదలైందా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఈ భారీ పతనానికి ప్రధాన కారణాలుగా.. ఏఐ, సెమీకండక్టర్ కంపెనీల అధిక వాల్యుయేషన్, నిరంతర ఖర్చుల వల్ల లాభాలు ఎప్పుడు వస్తాయోనన్న ఆందోళన, పెట్టుబడిదారులపై పెరుగుతున్న ఒత్తిడి వంటివి కనిపిస్తున్నాయి. ఇటీవల ఇన్వెస్ట్‌మెంట్ మార్కెట్‌లో వచ్చిన బూమ్‌తో ఏఐ, చిప్, రోబోటిక్స్ రంగాల కంపెనీలు భారీగా లాభపడ్డాయి. కానీ ఇప్పుడు అంతే వేగంగా పతనమవుతున్నాయి. ఇన్వెస్టర్లకు పండగే పండగ.. చరిత్రలోనే అతి పెద్ద ఐపీఓ.. 100 బిలియన్ డాలర్లు టార్గెట్‌గా వస్తోన్న ఆంథ్రోపిక్.. ఇది ఒక హెచ్చరిక గంట లాంటిది. దీనివల్ల బలమైన కంపెనీలు కూడా ఇప్పుడు నష్టాల్లోకి జారుకునే పరిస్థితి ఏర్పడింది. అంతమాత్రాన ఏఐ రంగం పతనమే అంటే కాదనే చెప్పాలి. పెట్టుబడిదారులు ఇప్పుడు చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారని ఇది సూచిస్తోంది. మరి దీని తర్వాత ఏం జరగబోతోంది ఇకపై చిప్, రోబోటిక్స్, డేటా సెంటర్, ఏఐ స్టార్టప్ కంపెనీలు తమ వ్యాపార విస్తరణకు నిధులు సమీకరించడం కష్టంగా మారనుంది. ప్రపంచ దేశాలన్నీ తమ ఏఐ పాలసీలను, పెట్టుబడి విధానాలను పునఃసమీక్షించడం ప్రారంభిస్తాయి. మరోవైపు, టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ, భారీ ఖర్చులను తట్టుకోలేని కంపెనీలు మూతపడతాయి, లేదా పెద్ద కంపెనీలు వాటిని కొనుగోలు చేస్తాయి. దీన్నిబట్టి చూస్తే, ఏఐ రంగంలో బబుల్ పేలుడుకు కావాల్సిన అన్ని సంకేతాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

డబ్ల్యూపీఎల్ వేలంలో సోఫీ, కిరణ్ నవ్గిరేపై కాసుల వర్షం.. ఐదు జట్ల పూర్తి స్క్వాడ్‌లు ఇవే



మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) 2027 సీజన్ కోసం ఆటగాళ్ల వేలం కొచ్చిలో బుధవారం ముగిసింది. ఈ వేలంలో ఐదు ఫ్రాంచైజీలు కలిసి మొత్తం 26 మంది క్రీడాకారిణులను కొనుగోలు చేశాయి. రాబోయే ఐదో ఎడిషన్ కోసం అన్ని జట్లు తమ పూర్తి స్క్వాడ్‌లను ఖరారు చేసుకున్నాయి. ఈ వేలంలో ఆస్ట్రేలియా కెప్టెన్ సోఫీ మోలినెక్స్ అత్యధిక ధర పలికింది. ఆమెను యూపీ వారియర్జ్ జట్టు ఏకంగా రూ. 1.10 కోట్లకు కొనుగోలు చేసింది. మరోవైపు భారత బ్యాటర్ కిరణ్ నవ్గిరే అత్యధిక ధర పొందిన భారత క్రీడాకారిణిగా నిలిచింది. ఆమెను ఢిల్లీ క్యాపిటల్స్ రూ. 75 లక్షలకు సొంతం చేసుకుంది.వేలం ప్రక్రియ ముగియడంతో ఐదు జట్లు రాబోయే సీజన్‌కు పటిష్ఠమైన స్క్వాడ్‌లతో సిద్ధమయ్యాయి. ఆయా జట్ల పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.ముంబై ఇండియన్స్: హర్మన్‌ప్రీత్ కౌర్(కెప్టెన్), నాట్ స్కివర్-బ్రంట్, హేలీ మాథ్యూస్, అమన్‌జోత్ కౌర్, అమేలియా కెర్, షబ్నిమ్ ఇస్మాయిల్, సంస్కృతి గుప్తా, సజన సజీవన్, రహిలా ఫిర్దౌస్, నికోలా క్యారీ, వైష్ణవి శర్మ, తారా నోరిస్, దిశా కసత్, భారతీ రావల్, లతికా ఇనామ్‌దార్, అక్షిత భగర్, శ్వేతా సెహ్రావత్, సానికా చాల్కే.రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: స్మృతి మంధాన(కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), ఎల్లీస్ పెర్రీ, లారెన్ బెల్, పూజా వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, నడిన్ డి క్లర్క్, రాధా యాదవ్, శ్రేయాంక పాటిల్, జార్జియా వోల్, జెస్ జొనాస్సెన్, తేజల్ హసబ్నిస్, సయాలీ సత్ఘరే, క్లో ట్రయాన్, ప్రేమ రావత్, ఫ్రెండా దినేష్, కుమార్ ప్రత్యూష.ఢిల్లీ క్యాపిటల్స్: జెమీమా రోడ్రిగ్స్ (కెప్టెన్), షఫాలీ వర్మ, మరిజాన్నే కాప్, నికి ప్రసాద్, లారా వోల్వార్డ్, చినెల్ హెన్రీ, శ్రీ చరణి, దీయా యాదవ్, మమత మడివాల, నందిని శర్మ, లూసీ హామిల్టన్, మిన్ను మణి, అన్నాబెల్ సదర్లాండ్, కిరణ్ నవ్గిరే, ఉమా ఛెత్రీ, కిర్టీ గోర్డాన్, నజ్మా ఖాన్.యూపీ వారియర్జ్: మెగ్ లానింగ్ (కెప్టెన్), దీప్తి శర్మ, సోఫీ ఎక్లెస్టోన్, ఫోబీ లిచ్‌ఫీల్డ్, పర్లీన్ డియోల్, క్రాంతి గౌడ్, శిఖా పాండే, శిప్రా గిరి, సిమ్రాన్ షేక్, ప్రతికా రావల్, సోఫీ మోలినెక్స్, గ్రేస్ హారిస్, సుష్మా వర్మ (వికెట్ కీపర్), స్నేహ్ రాణా, సహానా పవార్, మనాలి దక్షిణి, కాథ్రిన్ బ్రైస్, ఆశా శోభన.గుజరాత్ జెయింట్స్: ఆష్లీ గార్డనర్(కెప్టెన్), బెత్ మూనీ, సోఫీ డివైన్, రేణుకా సింగ్ ఠాకూర్, భారతీ ఫుల్మాలి, కశ్వవీ గౌతమ్, కనికా అహూజా, తనుజా కన్వర్, జార్జియా వేర్‌హామ్, అనుష్క శర్మ, హ్యాపీ కుమారి, కిమ్ గార్త్, యస్తికా భాటియా, రాజేశ్వరి గైక్వాడ్, జింటిమణి కలిత, జి. కమలిని, ఓర్లా ప్రెండర్‌గాస్ట్, సమైరా రాఘవ్.

ఈ శతాబ్దంలోనే తొలి ఆటగాడు.. చరిత్ర సృష్టించిన సర్ఫరాజ్ సోదరుడు ముషీర్‌ఖాన్



రంజీ ట్రోఫీలో యువ ఆల్‌రౌండర్, టీమిండియా బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ తమ్ముడు ముషీర్ ఖాన్ చరిత్ర సృష్టించాడు. హరియాణాతో జరుగుతున్న ఎలైట్ గ్రూప్ డి మ్యాచ్‌లో బ్యాట్‌తో సెంచరీ బాదిన అతడు.. బంతితో ఆరు వికెట్లు పడగొట్టి అద్భుతమైన ఆల్ రౌండ్ ప్రదర్శన కనబరిచాడు. 21వ శతాబ్దంలో ఒకే ఫస్ట్-క్లాస్ మ్యాచ్‌లో సెంచరీతో పాటు ఐదుకు పైగా వికెట్లు తీసిన తొలి ముంబై ఆటగాడిగా ముషీర్ ఖాన్ అరుదైన రికార్డును తన పేరిట లిఖించుకున్నాడు. ఈ ఘనత సాధించిన చివరి ముంబై ఆటగాడు రవిశాస్త్రి కావడం విశేషం.ముంబైలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్‌లో జరుగుతున్న ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ముంబై జట్టు 430 పరుగుల భారీ స్కోరు చేసింది. ఇందులో ముషీర్ ఖాన్ 185 బంతుల్లో 109 పరుగులు చేసి కీలక పాత్ర పోషించాడు. మరో యువ ఆటగాడు అంక్రిష్ రఘువంశీ (114) కూడా శతకంతో రాణించాడు. అనంతరం బౌలింగ్‌లోనూ ముషీర్ తన మ్యాజిక్ చూపించాడు. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్నర్ అయిన అతడు 85 పరుగులిచ్చి 6 వికెట్లు పడగొట్టాడు. హరియాణా తొలి ఐదు వికెట్లనూ అతడే తీయడం గమనార్హం.ముషీర్ దెబ్బకు హరియాణా తొలి ఇన్నింగ్స్‌లో 270 పరుగులకే ఆలౌట్ అయింది. ఆ జట్టులో నిశాంత్ సింధు (105 నాటౌట్) ఒక్కడే ఒంటరి పోరాటం చేశాడు. దీంతో ముంబైకి 160 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. వెంటనే హరియాణాను ఫాలో ఆన్‌కు ఆహ్వానించింది. మూడో రోజు ఆట ముగిసే సమయానికి హరియాణా రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 73 పరుగులు చేసింది. ఆ జట్టు ఓటమి నుంచి తప్పించుకోవాలంటే ఇంకా 87 పరుగులు చేయాల్సి ఉంది.లెజెండ్స్ సరసన ముషీర్.ఒకే రంజీ మ్యాచ్‌లో సెంచరీ, ఐదుకు పైగా వికెట్లు తీసిన ఆరో ముంబై క్రికెటర్‌గా ముషీర్ నిలిచాడు. గతంలో మదన్ రాయ్జీ (1947-48), దత్తు ఫడ్కర్ (1948-49), వినూ మన్కడ్ (1953-54), పాలీ ఉమ్రిగర్ (1957-58), రవిశాస్త్రి (1990-91) మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇక సెంచరీతో పాటు ఆరు వికెట్ల ప్రదర్శన విషయానికొస్తే, 77 ఏళ్ల క్రితం ఫడ్కర్ తర్వాత మళ్లీ ఇప్పుడే ముషీర్ ఆ ఫీట్ నమోదు చేశాడు.పిచ్ నెమ్మదించిందని, టర్న్ లభించే చోట బంతులు వేయడంపై దృష్టి సారించానని మ్యాచ్ అనంతరం ముషీర్ చెప్పాడు. ఈ మ్యాచ్‌లో బోనస్ పాయింట్‌తో వరుసగా మూడో విజయం సాధించి నాకౌట్ బెర్తును ఖరారు చేసుకోవాలని ముంబై జట్టు పట్టుదలగా ఉంది.

అభిషేక్ శర్మ బ్యాటింగ్ విన్యాసాల వెనుక ఇంత కథ ఉందా



భారత టీ20 క్రికెట్‌లో అభిషేక్ శర్మ పేరు ఇప్పుడు ఒక సంచలనం. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో మ్యాచ్‌లను ఒంటిచేత్తో గెలిపిస్తూ, ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారాడు. తాజాగా మంగళవారం నాడు వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో కేవలం 35 బంతుల్లోనే సెంచరీ సాధించి, తన అసాధారణ పవర్ హిట్టింగ్ సామర్థ్యాన్ని మరోసారి ప్రపంచానికి చాటాడు. అయితే, మైదానంలో కనిపించే ఈ సిక్సర్ల మోత, మెరుపు ఫుట్‌వర్క్ వెనుక ఏళ్ల తరబడి పడిన కఠోర శ్రమ, క్రమశిక్షణ, మానసిక సంసిద్ధత దాగి ఉన్నాయి.ఈ మ్యాచ్‌లో 199 పరుగుల లక్ష్య ఛేదనలో అభిషేక్ కేవలం 38 బంతుల్లో 113 పరుగులు చేసి భారత్‌కు ఆరు వికెట్ల తేడాతో చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. మరో యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీతో కలిసి పవర్‌ప్లేలోనే 118 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పి, మ్యాచ్‌ను పూర్తిగా భారత్ వైపు తిప్పేశాడు. 26 ఏళ్ల ఈ యువ బ్యాటర్ కెరీర్‌లో ఇది మరో మైలురాయి. ఇంతకీ, ఈ అద్భుత ప్రదర్శనల వెనుక ఉన్న శారీరక, మానసిక కసరత్తులు ఏంటి

తెల్లవారుజామున 4 గంటలకే శిక్షణ

అంతర్జాతీయ స్టార్ కాకముందు నుంచే అభిషేక్ తన శిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇచ్చేవాడు. అతని తండ్రి, చిన్ననాటి కోచ్ రాజ్‌కుమార్ శర్మ ప్రకారం, అభిషేక్ రోజు తెల్లవారుజామున 4 గంటలకే ప్రారంభమయ్యేది. జిమ్ సెషన్లు, వ్యాయామం, రన్నింగ్, స్విమ్మింగ్ పూర్తి చేసుకున్న తర్వాతే క్రికెట్ ప్రాక్టీస్‌కు వెళ్లేవాడు. ఆధునిక క్రికెట్‌లో శారీరక దృఢత్వం ఎంత ముఖ్యమో ఈ దినచర్య తెలియజేస్తుంది. పవర్ హిట్టింగ్‌కు అవసరమైన బలాన్ని, సమన్వయాన్ని చిన్నతనం నుంచే అలవర్చుకున్నాడు.

యువరాజ్ సింగ్ మార్గదర్శకత్వం

అభిషేక్ ఎదుగుదలలో భారత మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ పాత్ర అత్యంత కీలకం. యువరాజ్ అతనికి మార్గదర్శిగా ఉంటూ, అతని సామర్థ్యాలపై నమ్మకాన్ని పెంచడంలో సహాయపడ్డాడు. అభిషేక్ తండ్రి సైతం, యువరాజ్ తన కొడుకు శిక్షణలో ఎంత శ్రద్ధ చూపేవాడో పలుమార్లు వెల్లడించారు. ఆటలో ఏమైనా లోపాలుంటే సరిదిద్దడానికి యువీ ఎప్పుడూ ముందుంటాడని తెలిపారు. ఒక అనుభవజ్ఞుడైన మెంటర్ మార్గదర్శకత్వం ఎంత ముఖ్యమో ఇది చూపిస్తుంది.

శారీరక, మానసిక ప్రశాంతత కోసం

కేవలం శారీరక శ్రమ మాత్రమే కాదు, అభిషేక్ తన మానసిక ఆరోగ్యంపైనా అంతే శ్రద్ధ చూపుతాడు. ఒత్తిడిని అధిగమించడానికి అతను ధ్యానాన్ని ఒక



రష్మిక పాత్ర కోసం వెళ్లి సీతగా.. 'సీతారామం' చిత్రంలో మృణాల్ ఠాకూర్ ఎంపిక వెనుక అసలు కథ ఇదే.!

యువ నటి మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో టాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'సీతారామం' ఎంతటి మైలురాయిగా నిలిచిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఈ చిత్రంలో ఆమెను మొదట 'అఫ్రీన్' పాత్ర కోసమే సంప్రదించారట. కానీ కథ చెప్పే క్రమంలో దర్శకుడు హను రాఘవపూడి ఆమెను చూసి మనసు మార్చుకుని, ఏకంగా 'సీత మహాలక్ష్మి' ప్రధాన పాత్రకు ఎంపిక చేయడం విశేషం. దర్శకుడు హను రాఘవపూడి దాదాపు ఐదు గంటల పాటు ఎంతో ఓపికగా, భావోద్వేగాలతో ఈ కథను తనకు వినిపించారని, ఆ నెరేషన్ తనను ఎంతగానో కదిలించిందని మృణాల్ పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారు. నాగ్ అశ్విన్ ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ బ్యూటీ, సీత పాత్రలో ఒదిగిపోయి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆ పాత్రలోని స్వచ్ఛత, అంకితభావం ఈ సినిమాను టాలీవుడ్‌లో ఒక కల్ట్ క్లాసిక్‌గా నిలబెట్టాయి.

నాకు భర్త అవ్వాలంటే.. ఇవి ఉండాలి

తెలుగు సినీ పరిశ్రమలో వరుస సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది యువ కథానాయిక రితికా నాయక్. 'అశోకవనంలో అర్జున కల్యాణం', 'మిరాయ్' చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీ.. నేడు పుట్టినరోజు నిర్వహించుకుంటోంది. ఈ సందర్భంగా ఆమెకు సంబంధించిన ఆసక్తికర విషయాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. గతంలో ఓ ఇంటర్వ్యూలో తనకు నచ్చిన హీరో ఎవరో చెప్పిన రితికా.. తనను పెళ్లి చేసుకునే వ్యక్తిలో ఎలాంటి లక్షణాలు ఉండాలో కూడా వెల్లడించింది. ఇప్పుడీ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

సినిమా రంగంలో కథానాయికగా గుర్తింపు తెచ్చుకోవాలంటే అందం ఒక్కటే సరిపోదు. నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలి. ఇదే ఆలోచనతో ముందుకు సాగుతోంది రితికా నాయక్. తనకు అందమైన రూపం ఉందని మాత్రమే కాకుండా.. 'బాగా నటిస్తుంది' అని ప్రేక్షకులు అనుకోవాలన్నదే తన లక్ష్యమని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. అన్ని రకాల పాత్రల్లో నటించాలని ఉందని, ఒక్క తరహా పాత్రలకే పరిమితం కావడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేసింది.

మీ క్రష్ ఎవరని రితికాను ఓ సందర్భంలో అడగ్గా.. తనకు అల్లు అర్జున్‌పై క్రష్ ఉందని రితికా నాయక్ చెప్పుకొచ్చింది. అదే సందర్భంలో జీవిత భాగస్వామి విషయంలోనూ ఆమెకు కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉన్నాయని తెలిపింది. తనను ఎంతో ప్రేమించే వ్యక్తి కావాలని, బంధంలో నమ్మకానికి ప్రాధాన్యమివ్వాలని తెలిపింది. అంతేకాదు.. తన వృత్తిని అర్థం చేసుకుంటూ, కెరీర్‌లో ముందుకు సాగేందుకు ప్రోత్సహించే వ్యక్తి తనకు భర్తగా రావాలని కోరుకుంటున్నట్లు పేర్కొంది. కాగా ఇటీవల కొరియన్ కనకరాజుతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన రితికా.. వరుస అవకాశాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం పరుణ్‌తేజ్‌తో కలిసి 'డ్యూయెట్' అనే సినిమాలో నటిస్తోంది.





అయ్యప్పపై 'మాలికాపూరం' దర్శకుడి కొత్త చిత్రం.. 'మణికంఠ' ఫస్ట్ లుక్ విడుదల

మలయాళంలో సంచలన విజయం సాధించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'మాలికాపూరం' దర్శకుడు విష్ణు శశి శంకర్ నుంచి మరో ఆధ్యాత్మిక చిత్రం రాబోతోంది. తంత్రా ఫిలిమ్స్ పతాకంపై తరకెక్కుతున్న తాజా చిత్రం 'మణికంఠ' అయ్యప్ప స్వామి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. '(అయ్యప్ప దర్శనానికి సిద్ధం కండి) అంటూ సాగిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో వైభవ్ టైటిల్ రోల్‌లో నటించబోతుండగా, మీనాక్షి గోవిందరాజన్ అరవింద్ ఆకాష్ జె.కె. శరవలు తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్ గి అమరన్ సంగీతం అందిస్తుండగా, సూర్య రాజీవన్, శతశ్ కుమార్ తదితరులు ఇతర సాంకేతిక విభాగాల్లో పని చేస్తున్నారు. అయ్యప్ప భక్తులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకునేలా రూపొందుతున్న ఈ 'మణికంఠ' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలువడనున్నాయి.

ఇటు సీత.. అటు ఐపీఎస్ ఆఫీసర్

సాయిపల్లవి.. ఈ పేరు రాబోయే నెలరోజుల్లో కాస్త గట్టిగానే వినిపించనుంది. ఎందుకంటే చాన్నాళ్లుగా దక్షిణాది సినిమాల్లో కనిపించని ఈ బ్యూటీ.. కేవలం 15 రోజుల వ్యవధిలో రెండు క్రేజ్ ఉన్న మూవీస్‌తో రాబోతుంది. ఆయా పాత్రలు, సదరు చిత్రాల్లో సాయిపల్లవే మెయిన్ హైలైట్‌గా కానుందని అనిపిస్తోంది. మొదటగా 'రామాయణ' విషయానికొస్తే ఇందులో ఈమె సీత పాత్ర పోషించింది. వచ్చే శుక్రవారం అంటే నవంబర్ 05న పాన్ ఇండియా రేంజులో ఈ మూవీ రిలీజ్ కానుంది. టీజర్ వచ్చినప్పుడు సీత పాత్ర, ఆహార్యాన్ని సంచేహిస్తూ కొందరు ట్రోల్స్ చేశారు. ట్రైలర్, సాంగ్స్ వచ్చిన తర్వాత ఇవి కాస్త తగ్గినట్లే కనిపించాయి. ప్రమోషనల్ కంటెంట్‌పై ఎన్ని విమర్శలైనా రావొచ్చు కానీ మూవీ వచ్చిన తర్వాత అందులో సీత పాత్ర ఆకట్టుకుంటే మాత్రం ఇవన్నీ పక్కకువెళ్లిపోతాయి. 'ఓం' విషయానికొస్తే.. ధనుష్ హీరోగా చేసిన తమిళ సినిమా ఇది. ఇందులో ఐపీఎస్ నిత్యారెడ్డి అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా సాయిపల్లవి నటించింది. ఈమె పాత్రకు సంబంధించిన గ్లింప్స్ అయితే అదిరిపోయింది. ధనుష్, మమ్ముట్టి పాత్రలతో పాటు ఈమది ఎక్కువగా హైలైట్ అయ్యేలా ఉందనిపిస్తోంది. ఈ మూవీ నవంబర్ 20న తెలుగు, తమిళంలో రిలీజ్ కానుంది. గతేడాది ఫిబ్రవరిలో 'తండేల్' మూవీతో థియేటర్లలోకి వచ్చిన సాయిపల్లవి.. అద్భుతమైన సక్సెస్ అందుకుంది. మళ్లీ ఈ ఏడాది మే నెలలో 'ఏక్ దిన్' అని హిందీలోకి ఎంట్రీ ఇచ్చింది కానీ ఇది ఘోరంగా డిజాస్టర్ అయింది. దీంతో ఆశలన్నీ 'రామాయణ' మీదే పెట్టుకుంది. ఒకవేళ ఈ రెండు సినిమాలు హిట్ అయి, సాయిపల్లవి పాత్రలకు పేరొస్తే ఈ నవంబర్ ఈమెకు స్పెషల్ అవుతుంది. లేదంటే కష్టమే!



M/S ACHUKATLA PUBLICATIONS D.NO. 9/1542, M.R. ROAD, GOOTY RS, ANANTHAPUR, ANDHRA PRADESH - 515402.